ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 కర్ణాటక వార్తలు

శనివారం 29 నవంబరు 2025

ఐదుగురు మఠాధిపతులతో ప్రధాని చర్చలు

ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకృష్ణుడిని దర్శించుకున్నాక శ్రీకృష్ణమఠంలో ఐదుగురు స్వామీజీలతో చర్చలు జరిపారు. పుత్తిగె పర్యాయ మఠాధిపతి సుగుణేంద్రతీర్థ స్వామీజీ, పెజావర విశ్వప్రసన్నతీర్థ స్వామీజీ, పుత్తిగె సుశీంద్ర తీర్థస్వామీజీ, శిరూరు వేదవర్ధన తీర్థ స్వామిజీ, కుక్కె సుబ్రమణ్య విద్యాప్రసన్నతీర్థ స్వామీజీలతో ప్రధాని చర్చించారు. ఉడుపి శ్రీకృష్ణమఠంలో కనకనకిండి (కనకదాసు కిటికీ)కి రూ.2కోట్లతో సిద్ధం చేసిన బంగారు కవచాన్ని, సువర్ణతీర్థ మండపాన్ని ప్రధాని లాంఛనంగా ఆవిష్కరించారు.


కనకనకిండి ద్వారా శ్రీకృష్ణుడిని దర్శించుకుంటున్న ప్రధాని

- శాంతి స్థాపన కోసమే గీతోపదేశం
- శ్రీకృష్ణుడి ఉపదేశం.. అన్ని యుగాలకు ఆచరణీయం
- ఉడుపి శ్రీకృష్ణ మఠంలో ప్రధాని నరేంద్ర మోదీ
- రోడ్డు షోకు తరలివచ్చిన అభిమానులు
- వీధుల్లో మార్మోగిన నమో నినాదాలు
- మఠాధిపతులతో ప్రధాని చర్చలు


తలపాగాపై నెమలి పింఛం ధరించి ప్రసంగిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ


ఉడుపిలో లక్షకంఠ గీతా పఠనంలో పాల్గొన్న మహిళలు

శాంతిగీతం

బెంగళూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణుడు యుద్ధభూమిలో గీతోపదేశం ఇచ్చారని, శాంతి సత్యాన్ని తిరిగి స్థాపించడంకోసమే భగవంతుడు ప్రయత్నించారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. శుక్రవారం శ్రీకృష్ణుడు జన్మించిన పవిత్రస్థలమైన ఉడుపిలోని శ్రీకృష్ణమఠాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ దర్శించుకున్నారు. ఉడుపి జిల్లాలో ఒకరోజు పర్యటనకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ విచ్చేశారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో మంగళూరుకు చేరుకుని అక్కడనుంచి హెలికాప్టర్ మార్గంగా ఉడుపికి వచ్చారు. బన్నంజె సర్కిల్ నుంచి ఉడుపి ఆలయం దాకా 2 కిలోమీటర్ల మేర ప్రధానమంత్రి రోడ్‌షో సాగింది. భారీ బందోబస్తు, బ్యారికేడ్‌లు ఏర్పాటుచేసినా ప్రతిచోటా అభిమానం పెల్లుబికింది. రోడ్‌షో సాగినంత దూరం ప్రధానిపై ప్రజలు పూలు చల్లి స్వాగతించారు. అక్కడే శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు. శ్రీకృష్ణ మఠంలో లక్షకంఠ గీతాపఠనంలో భాగస్వామ్యులయ్యారు. భగవద్గీత 15వ అధ్యాయంలోని 10 శ్లోకాలను పఠించారు. నవసంకల్పాలను ప్రధాని చేశారు. అందులో జల సంరక్షణతోపాటు మొక్కలు పెంపకం, తల్లి పేరిట ఒక చెట్టు నాటడం, ప్రతి ఒక్కరూ ఒక పేదవాడి జీవనానికి అండగా నిలవడం, స్వదేశీ మంత్ర, ఓకల్ ఫర్ లోకల్, సేంద్రియసాగు, ఆరోగ్యవంతమైన జీవనశైలి, ఆహారంలో వంటనూనె శాతం తగ్గించడం, చిరుధాన్యాల వాడకం పెంచడం, జీవితంలో యోగాను అనుసంధానం చేసుకోవడం, హస్తప్రతి (తాళపత్రాల) సంరక్షణ, దేశంలో 25 పుణ్యక్షేత్రాలు దర్శనం చేసుకునే సంకల్పం బూనాలని ప్రధాని పిలుపునిచ్చారు. దేశప్రజలందరూ ప్రతి ఒక్కరూ ఇదే విధానాన్ని అలవరుచుకోవాలన్నారు.

ఉడుపి మఠాన్ని కొనియాడిన ప్రధాని

తాను గుజరాత్‌లో జన్మించినా ఉడుపితో అవినాభావ సంబంధం ఉందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఉడుపిని దర్శించుకోవడాన్ని ప్రత్యేకమైన అనుభూతిగా భావిస్తున్నానన్నారు. ద్వారకలో శ్రీకృష్ణుడి దర్శనం పొందానన్నారు. ఉడుపికి రావడం అంటే నేను ఎంతో ప్రత్యేకంగా భావిస్తా అన్నారు. గతంలో స్వచ్ఛతా అభియానలో ఉడుపి తొలిస్థానంలో నిలిచిందన్నారు. ఉడుపి బీజేపీకి కర్మభూమి లాంటిదన్నారు. కలియుగంలో భగవంతుడి నామస్మరణతోనే మోక్షం సాధ్యమన్నారు. లక్షకంఠ గీతాపారాయణ మనకు కొత్త శక్తినిస్తుందన్నారు. పుత్తిగె పర్యాయ పీఠాధిపతి సుగుణేంద్రతీర్థస్వామీజీ చేపట్టిన ఈ కార్యక్రమం ప్రత్యేకం అన్నారు. మూడు రోజులక్రింద అయోధ్యలో తాను ధర్మధ్వజాన్ని స్థాపించానన్నారు. శ్రీరామమందిర పోరాటంలో ఉడుపిపాత్ర ఎటువంటిదనేది దేశమంతటా తెలుసునన్నారు. స్వర్గీయ పెజావర పీఠాధిపతి విశ్వేశ తీర్థస్వామీజీని స్మరించాల్సిందేనన్నారు. రామమందిర నిర్మాణానికి ఉడుపికి మరో ప్రత్యేకత ఉందంటూనే కొత్త మందిరంలో మధ్వాచార్య పేరిట ఒక ద్వారం నిర్మించారన్నారు. రామమందిర పరిషత్ ఒక ద్వారాన్ని మధ్వాచార్య పేరిట ఏర్పాటు చేయడం ఉడుపికి మరో గౌరవం అన్నారు. జగద్గురు మధ్వాచార్యుల పరంపర హరిదాస పరంపరలో ఒకటన్నారు. శ్రీకృష్ణుడి ఉపదేశం అన్ని యుగాలకు అన్వయించనుందన్నారు. భగవద్గీత ద్వారా భవిష్యత్తు తరాలకు అందించే ఓ ప్రక్రియ అన్నారు. అయోధ్య నుంచి ఉడుపి దాకా అసంఖ్యాక రామభక్తులు ఉన్నారన్నారు. శ్రీకృష్ణుడు యుద్ధభూమిలో ఉపదేశం ఇచ్చారని, శాంతి సత్యాన్ని తిరిగి స్థాపించడంతోపాటు దౌర్జన్యం అంతిమం చేయాలన్నదే మనకు నేర్పుతుందన్నారు. ఇది మన జాతీయ భద్రతా విధాన సారాంశమన్నారు. గతంలో ఉగ్రవాదుల దాడులకు ప్రతీకారాలు లేవంటూనే ఇప్పుడు కొత్త భారత్‌లో శాంతిస్థాపనతోపాటు రక్షణ మాకు తెలుసునన్నారు. పెహల్గాం సంఘటనలో కన్నడిగులు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. అటువంటి సంఘటనలకు మేం చేతులు కట్టుకుని కూర్చోలేమని, ఆపరేషన్ సిందూర్ ద్వారా తగిన గుణపాఠం చెప్పామన్నారు. ఇదే వేదికపై ప్రధానమంత్రి నరేంద్రమోదీకి భారత భాగ్యవిధాత బిరుదును పుత్తిగె పర్యాయ మఠాధిపతి సుగుణేంద్ర తీర్థస్వామీజీ ప్రదానం చేశారు.



ఉప్పొంగిన ఉత్సాహం

ఉడుపి పర్యటనలో ప్రధానమంత్రి నరేంద్రమోదీని చూసేందుకు స్థానిక ప్రజలు ఉత్సాహం చూపారు. సాధారణంగా రోడ్‌షోలో అభివాదం చేయడం లేదా ఫొటోలు చూపడం, పూలు చల్లడం వంటివి ఉంటాయి. కానీ ఉడుపిలో తీరప్రాంత కళలు, సంస్కృతిని ప్రతిబింబించేలాగా రోడ్డుకు ఓవైపు పలు చోట్ల ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేసి యక్షగానం, పులివేషం, శ్రీకృష్ణవేషధారుల ప్రదర్శనతోపాటు పలు నాట్య ప్రదర్శనలు కొనసాగాయి. 2008లో గుజరాత్ సీఎం హోదాలో ఉడుపిని దర్శించుకున్నారు. 2018లో ఎన్నికల ప్రచారానికి వచ్చినా బహిరంగసభకే పరిమితమైంది. సుమారు 2 కిలోమీటర్ల దూరం రోడ్‌షో సాగడంతో వేలాదిమంది ప్రజలు, అభిమానులు తరలివచ్చారు. ప్రధాని పర్యటనలో రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్, కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, ధర్మస్థళ ధర్మాధికారి, రాజ్యసభ సభ్యుడు వీరేంద్రహెగ్డే, ఎంపీలు కోట శ్రీనివాస పూజారి, బ్రిజేశ్‌చౌట, బీవై రాఘవేంద్ర, స్థానిక ఎమ్మెల్యేలు సునిల్‌కుమార్, యశ్‌పాల్ సువర్ణ, గుర్మె సురేశ్‌శెట్టి, కిరణ్‌కుమార్, గురురాజ్ గంటిహోళతోపాటు పలువురు పాల్గొన్నారు.


తరలివచ్చిన అభిమానులు



భారత భాగ్య విధాత పురస్కారంతో ప్రధానిని సత్కరిస్తున్న సుగుణేంద్రతీర్థ స్వామీజీ



వేదికపై చిన్నారులతో సీఎం, డీసీఎం తదితరులు

తల్లీబిడ్డల సంరక్షణలో కీలకపాత్ర

- ఐసీడీఎస్‌తో చిన్నారులకు పౌష్టికాహారం
- 50ఏళ్ల ఉత్సవాల్లో సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ పథకం ద్వారా తల్లీబిడ్డల మరణాల శాతం తగ్గించడం, పౌష్టికాహార లోపం నివారించడంలో కీలకపాత్ర పోషిస్తోందని సీఎం సిద్దరామయ్య అన్నారు. ఐసీడీఎస్ అమలులో దేశంలో కర్ణాటక తొలిస్థానంలో ఉందన్నారు. సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసీడీఎస్) 50ఏళ్లు పూర్తైన సందర్భంగా నగరంలోని ప్యాలెస్ గ్రౌండ్స్‌లో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. చిల్డ్రన్స్‌డే, వరల్డ్ సీనియర్ సిటిజన్స్ డే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో 69,922 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 40లక్షల మందికిపైగా మహిళలు, చిన్నారులు ప్రయోజనం పొందుతున్నారన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దూరదృష్టితో ఐసీడీఎస్ పథకాన్ని ప్రారంభించారన్నారు. అక్టోబరు 2కు పథకానికి 50ఏళ్లు నిండాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కార్యకర్తలు, సహాయకులు ప్రామాణికంగా సేవలందిస్తున్నారని, చిన్నారుల బాగోగులు చూస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు రెండో తల్లివంటివారన్నారు. గ్యారెంటీలకు లక్ష 4వేల కోట్ల రూపాయలకుపైగా ఖర్చు చేస్తున్నామన్నారు. శక్తి పథకం ద్వారా 600కోట్ల మందికిపైగా మహిళలు ప్రభుత్వ బస్సులలో ఉచితంగా ప్రయాణించారన్నారు. గృహలక్ష్మి పథకం కింద 1.26 కోట్ల కుటుంబాల యజమానికి రూ.2వేలు ఇస్తున్నామన్నారు. యువతులు, మహిళలు ఆర్థికంగా విద్యాపరంగా బలోపేతం కావాలని, మహిళలు ప్రధానస్రవంతిలోకి వచ్చి సమాన అవకాశాలను కల్పించాలనే ఉద్దేశ్యంతో పథకాలు అమలు చేస్తున్నామన్నారు. అభివృద్ధికి, పథకాలకు గ్రాంట్ల కొరత లేదన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు కేంద్రం నుంచి రూ.2,700 వస్తుండగా రాష్ట్రప్రభుత్వం రూ.8,500 ఇస్తోందన్నారు. దేశంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు అధికంగా గౌరవధనం చెల్లిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 5వేల అంగన్‌వాడీ కేంద్రాలలో ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను ప్రారంభించినట్టు తెలిపారు. ఇదే సందర్భంగా అక్క టాస్క్‌ఫోర్స్‌ను ప్రారంభించారు.

అంగన్‌వాడీ కేంద్రం.. సరస్వతీదేవి సన్నిధి: డీసీఎం

చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు సరస్వతి సన్నిధివంటివని డీసీఎం డీకే శివకుమార్ పేర్కొన్నారు. ఇల్లే మొదటిపాఠశాల అని, తల్లే తొలి గురువన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తమ బిడ్డలకంటే ఎక్కువ సమయం అంగన్‌వాడీ కేంద్రానికి సేవలందిస్తున్న త్యాగమూర్తులన్నారు. స్త్రీలు అక్షరాస్యులైతే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. స్త్రీశక్తి సంఘాలు బలోపేతం కావాలన్నారు. స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్, మంత్రులు మునియప్ప, ఈశ్వర్‌ఖండ్రె, హెచ్‌సీ మహదేవప్ప తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లను, దివ్యాంగులను రాణించిన అంగన్‌వాడీ కార్యకర్తలను ఆత్మీయంగా సత్కరించారు.


హాజరైన మహిళలు

ఇందిరా క్యాంటీన్లు అధ్వానం

- కాంట్రాక్టర్లు మారినా రుచులు యథాతథం
- టెండర్ల దశలోనే 52..
- 169 క్యాంటీన్లకే ఆహారం సరఫరా

బెంగళూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆకలికేకలు ఉండరాదని రోజూ పనులు, వ్యాపారాలకోసం బెంగళూరుకు వచ్చే లక్షలాదిమందికి తక్కువధరకే కడుపు నింపేలా ఆహారం అందించేందుకే ఇందిరా క్యాంటీన్లు ఏర్పాటు చేశామని కాంగ్రెస్ ముఖ్యమంత్రి సిద్దరామయ్య తరచూ అంటుంటారు. 2013-18 పాలనలో బెంగళూరు నగర వ్యాప్తంగా అప్పటికి 198 వార్డులు ఉండగా ఒకటి చొప్పున ఇందిరాక్యాంటీన్‌లు చేస్తామని ప్రకటించారు. వార్డులో తగిన స్థలం లేకుంటే మొబైల్ క్యాంటీన్ ద్వారానైనా ఆహారం సమకూరుస్తామన్నారు. ఆ తర్వాత 2018లో శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి చెందింది. కానీ జేడీఎస్‌తో కలసి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 18 నెలలపాటు కుమారస్వామి సీఎంగా ఉన్నప్పుడు సజావుగా ఇందిరా క్యాంటీన్లు సాగాయి. ఆ తర్వాత బీజేపీ ప్రభుత్వంలో యడియూరప్ప, బసవరాజ్ బొమ్మైలు మూడున్నరేళ్ల పాలన సాగించినా ఎటువంటి వ్యత్యాసం లేకుండా కనీసం పేరు మార్చకుండానే ఇందిరాక్యాంటీన్ల పేరుతోనే బెంగళూరుతోపాటు వివిధ జిల్లా కేంద్రాలలో యథావిధిగా అమలు చేశారు.

2023లో మరోసారి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడింది. సిద్దరామయ్య రెండోసారి సీఎం అయ్యారు. ఎన్నికల్లో ఇచ్చిన గ్యారెంటీలకు ప్రాధాన్యం ఇస్తూనే పేదలు ఆకలితో ఉండరాదని ప్రకటించారు. ఇందిరాక్యాంటీన్లలో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రికి భోజనం మెనూను మారుస్తామని ప్రస్తుతం టిఫిన్‌గా అందిస్తున్న ఇడ్లీ, వడ, పొంగల్‌తోపాటు పలు పదార్థాలను యథావిధిగా కొనసాగిస్తూనే మధ్యాహ్నం, రాత్రి భోజనంలో గుడ్డు, చికెన్ వంటకాన్ని చేర్చే ఆలోచన ఉందని ప్రకటించారు. సామాన్యుడికి పౌష్టికాహారం అందించడమే తమ ఆశయమని మరిన్ని ప్రాంతాలలో ఇందిరాక్యాంటీన్‌లు తెరుస్తామని గొప్పలు పోయారు. వరుస సమావేశాలతో త్వరలోనే మార్పులంటూ గొప్పలు చెప్పారు. ఇదంతా రెండేళ్లక్రితం సాగిన ప్రక్రియ.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు ముగుస్తోంది. ఇందిరాక్యాంటీన్ల పనితీరులో మాత్రం ఎలాంటి తేడా లేదు. పైగా పర్యవేక్షణ లేక ఆహార పదార్థాలు మరింత నాసిరకంగా మారాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్త క్యాంటీన్ల ప్రారంభం ఎలా ఉన్నా, ఉన్నవాటికే దిక్కులేదనే పరిస్థితి మారింది. పేదలు, కూలీలు, ఆటో డ్రైవర్లు, వీధి వ్యాపారులకు తక్కువధరతోనే మూడు పూటలా ఆహారాన్ని అందించాలనే ప్రతిష్ఠాత్మకమైన ఇందిరాక్యాంటీన్‌లు రోజురోజుకు అధ్వానమనే పరిస్థితికి చేరాయి. బీజేపీ పాలకులు నిర్లక్ష్యం చేశారని కాంగ్రెస్ అధికారంలోకి వస్తానే మార్చేస్తామన్నారు. కేవలం 25 రూపాయలకే మూడుపూటలా ఆహారం అందించాలని 2017లో ఇందిరాక్యాంటీన్‌లు ప్రారంభించారు. బెంగళూరుతోపాటు పలు జిల్లా కేంద్రాలలోనూ క్యాంటీన్లు ప్రారంభమయ్యాయి. 2023లో సీఎంగా సిద్దరామయ్య, డీసీఎంగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టాక ఇందిరాక్యాంటీన్లకు కొత్త జీవం తీసుకొస్తామన్నారు. ఇంతకుముందు పాలకులు కనీసం పేదవారికి ఆకలి తీర్చే క్యాంటీన్ల విషయంలోనూ రాజకీయం చేశారన్నారు. అధ్వానస్థితిలో ఉన్న క్యాంటీన్లను సంపూర్ణంగా మరమ్మతులు చేస్తామని ప్రకటించారు. మరిన్ని కొత్త క్యాంటీన్లను ఏర్పాటు చేస్తామన్నారు. పైగా మెనూ మారుస్తామని ప్రకటించారు. ఇందిరాక్యాంటీన్‌లు ప్రారంభమైనప్పుడు ఉదయం ఇడ్లీ, ఉప్మా, చట్నీ, సాంబారు ఉండేది. పొంగల్, బిసిబెళెబాత్, చిత్రాన్నంతోపాటు రోజుకో రైస్‌బాత్ సమకూర్చేవారు. మధ్యాహ్నం అన్నం, సాంబారు, చపాతి లేదా రాగిముద్ద, స్వీట్ ఉంటుంది. రాత్రివేళ చపాతి, అన్నం, సాంబారు సమకూర్చేవారు. టిఫిన్ 5 రూపాయలు కాగా, భోజనం 10 రూపాయలుగా ఉండేది.

కొత్తగా రాగిముద్ద, బిసిబెళెబాత్, ఇడ్లీ, మంగళూరు బన్స్‌తోపాటు కొత్తగా టెండర్లు పిలుస్తామన్నారు. టిఫిన్, రాత్రిభోజనంలో కొంత మార్పులు చేస్తూ కొత్తగా టెండర్లు ఆహ్వానించారు. అందుకు అనుగుణంగానే ఆహారం సమకూర్చాల్సిన కొత్త టెండరుదారులు మెనూ ప్రకారం ఆహార పదార్థాలను సమకూర్చలేకపోతున్నారు. రోజురోజుకు ప్రభావం తగ్గిపోతోంది.



దొమ్మలూరులో..

169 క్యాంటీన్లకే ఆహారం

బెంగళూరులో 175 ఇందిరాక్యాంటీన్లు, 23 మొబైల్ క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని భావించారు. కానీ ప్రస్తుతానికి 169 క్యాంటీన్లు మాత్రమే పనిచేస్తున్నాయి. మొబైల్ క్యాంటీన్లు అన్నీ నిలిచిపోయాయి. కొన్నేళ్లకాలంగా మొబైల్ క్యాంటీన్లు పనిచేయడం లేదు. 27 సెంట్రల్ కిచెన్‌లు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 11మాత్రమే పనిచేస్తున్నాయి. మిగిలిన 16 సెంట్రల్ కిచెన్‌లు మూతపడ్డాయి. పశ్చిమ డివిజన్‌లో 36 క్యాంటీన్లను శశి క్యాటరింగ్ సర్వీసెస్ నిర్వహిస్తోంది. ప్రభుత్వం మూడుపూటలా టిఫిన్, భోజనానికి 35 రూపాయల సబ్సిడీ ఇస్తోంది. ఇక రివార్డ్ సంస్థ 140 క్యాంటీన్లను నిర్వహిస్తోంది. సంస్థకు 30 రూపాయల సబ్సిడీ అందుతోంది. బీబీఎంపీలో పాలకవర్గం ఉన్నప్పుడు ప్రతివార్డుకు ఒకటి చొప్పున 198 ఇందిరాక్యాంటీన్లు ఏర్పాటు చేయాలని భావించారు. వీటితోపాటు 52 కొత్త క్యాంటీన్ల నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించారు. 2024 డిసెంబరు 17న టెండరు ప్రక్రియ ప్రారంభించి 17 శాసనసభ నియోజకవర్గాల పరిధిలో 52 ఇందిరాక్యాంటీన్‌లను ప్రి-కాస్ట్ మోడల్‌లో నిర్మించదలిచారు. టెండర్ల ప్రక్రియ ప్రారంభమై ఏడాది కావస్తున్నా ఎటువంటి పురోగతికి నోచుకోలేదు. రెండేళ్ల వ్యవధిలో కెంపేగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ఒక ఇందిరాక్యాంటీన్ ప్రారంభం మినహా మరెక్కడా కొత్తగా ఏర్పాటు లేదా నిర్మాణం కాలేదు. ఆహారంలో నాణ్యత పాటించడం, పంపిణీలో దుర్వినియోగం కాకుండా ఉండాలనే మార్షల్స్‌ను నియమించారు. ఆహార పంపిణీ ప్రమాణానికి అనుగుణంగా కాంట్రాక్టు సంస్థలకు బిల్లు చెల్లిస్తారు. కానీ మెనూ, ఆహారంలో రుచి లేకపోవడంతో వినియోగదారులు వచ్చేవారు కరువవుతున్నారు. ఉదయం, మధ్యాహ్నం కొంత మెరుగు అనిపిస్తున్నా రాత్రి వేళ కొన్ని చోట్ల రెండంకెలు చేరడం కష్టంగా ఉన్నట్టు తెలుస్తోంది.

బీబీఎంపీలో పాలకవర్గం ఉన్నప్పుడు 225 వార్డులలోనూ ఇందిరాక్యాంటీన్‌లు ఏర్పాటు చేయదలిచారు. ప్రస్తుతం గ్రేటర్ బెంగళూరు అథారిటీకి అనుబంధంగా ఐదు పాలికెలు ఏర్పడ్డాయి. మొత్తం 369 వార్డులుగా విభజించారు. వాటి ప్రకారం వార్డుకో క్యాంటీన్ ఏర్పాటు చేయడం సవాల్‌గా మారుతోంది. ఇప్పటికైనా క్యాంటీన్లకు నాణ్యమైన భోజనం సరఫరా చేయాలని పలువురు కోరుతున్నారు.


వసంతనగర్ క్యాంటీన్‌లో సందడి (ఫైల్)

ప్రస్తుతం ఉన్న క్యాంటీన్ల వివరాలు

పాలికె	క్యాంటీన్లు	పనిచేస్తున్నవి	రద్దు అయినవి
బెంగళూరు సెంట్రల్	42	38	4
బెంగళూరు తూర్పు	17	15	2
బెంగళూరు ఉత్తర	41	38	3
బెంగళూరు దక్షిణ	34	28	6
బెంగళూరు పశ్చిమ	64	50	14



రెండో పంటకు నీరివ్వాల్సిందే

- బళ్లారిలో బీజేపీ నాయకుల ఆందోళన
- కుర్చీ కోసం కొట్లాటలో సీఎం, డీసీఎం బిజీ అయ్యారని నేతల ఆగ్రహం

9

ఎడ్లబండిపై ధర్నాకు వస్తున్న మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్ రెడ్డి

బీజేపీకి డీకే శివకుమార్ అవసరం లేదు

- కేంద్రమంత్రి సోమణ్ణ

బెంగళూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బీజేపీకి డీకే శివకుమార్ అవసరం లేదని అటువంటి ఆలోచన ఏదీ తమకు లేదని కేంద్రమంత్రి సోమణ్ణ తేల్చి చెప్పారు. శుక్రవారం చిక్కమగళూరు జిల్లా బాళేహొన్నూరులోని రంభాపురి మఠంలో కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడారు. డీకే శివకుమార్‌కు బీజేపీ మద్దతు ఉందా అనే ప్రశ్నకు ధీటుగా సమాధానమిచ్చారు. సీఎం కుర్చీ కోసం సిద్దరామయ్య, డీకే శివకుమార్ నాటక మాడుతున్నారన్నారు. ప్రజలు ఇచ్చిన ఆశీస్సులతో పాలన సాగించాల్సిందిపోయి కుర్చీ కోసం పాకులాడుతున్నారన్నారు. ఇదో అత్యంత అవినీతి ప్రభుత్వమని వారికి ఏవిధంగాను నైతికత లేదన్నారు. సిగ్గులేని ప్రభుత్వానికి అవినీతికి మరోపేరే సిద్దరామయ్య అన్నారు. రెండేళ్ళకిందట అప్పటి బీజేపీ ప్రభుత్వంపై 40శాతం కమీషన్ పాలన అంటూ ఆరోపణలు చేశారని ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో ఏకంగా 60-70శాతం అవినీతికి పాల్పడుతున్నారన్నారు. ప్రజల సొమ్మును ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారని మండిపడ్డారు. మరికొన్ని రోజులలోనే ప్రభుత్వం పతనం కానుందని జోస్యం పలికారు. బీజేపీ శక్తివంతమైన పార్టీ అని ప్రధాని మోదీ, అమిత్‌షా, జేపీ నడ్డాల నాయకత్వానికి తిరుగులేదన్నారు.

సమన్వయంతోనే సక్సెస్: డీఆర్ఎం



మాట్లాడుతున్న డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

గుంతకల్లు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్టేషన్ మేనేజర్లు, స్టేషన్ మాస్టర్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సమన్వయంతో పనిచేసి రైల్వేలో భద్రత, సమయ పాలన లక్ష్యాలను సాధించాలని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా పేర్కొన్నారు. రైల్వే డివిజనల్ కేంద్రంలోని మల్టీ డిసిప్లినరీ డివిజనల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో స్టేషన్ మేనేజర్లు, స్టేషన్ మాస్టర్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ల భాగస్వామ్యంలో భద్రతా సదస్సును శుక్రవారం ఉదయం నిర్వహించారు. సమావేశంలో డీఆర్ఎం మాట్లాడుతూ స్టేషన్ మేనేజర్లు, స్టేషన్ మాస్టర్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు తమ పరిధిలో సమయానుగుణంగా తనిఖీలను నిర్వహించాలన్నారు. విధి నిర్వహణలో షార్ట్‌కట్స్‌ను అనుసరించరాదని సూచించారు. కలిసికట్టుగా సమన్వయంతో పనిచేసినప్పుడే సత్ఫలితాలు లభిస్తాయన్నారు. విధి నిర్వహణలో చొరవచూపిన అధికారులను ప్రశంసించారు.

రైలు దారి మళ్లింపు

గుంతకల్లు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉత్తర మధ్య రైల్వేలోని వీరాంగన లక్ష్మీబాయి రైల్వే స్టేషన్‌లోని మూడో నంబరు ప్లాట్‌ఫాంలో జరుగుతున్న అభివృద్ధి పనుల కారణంగా గుంతకల్లు మీదుగా వెళ్లే ఓ రైలును దారి మళ్లించనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఢిల్లీ సరాయ్ రోహిల్లా-యశ్వంతపూర్ వీక్లీ దురంతో (12214) ఎక్స్‌ప్రెస్‌ను డిసెంబరు 1వ నుంచి జనవరి 5 వరకూ దారి మళ్లించి నడపనున్నట్లు తెలిపారు. ఈ రైలును పేర్కొన్న తేదీల మధ్య మధుర, బయాన, సోగరియా, రుథియాయి, బీనా స్టేషన్ల మీదుగా దారి మళ్లించనున్నట్లు వివరించారు.

రైల్వే ఉద్యోగి భార్య ఆత్మహత్య

గుత్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గుత్తిఆర్ఎస్ రైల్వే ఇనిస్టిట్యూట్ సమీపంలో ఉన్న రైల్వే క్వార్టర్స్‌లో నివసిస్తున్న రైల్వే ఉద్యోగి భార్య జ్యోతి(23) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాహుల్ కుమార్ స్థానిక రైల్వేలో లోకో పైలెట్‌గా పని చేస్తున్నాడు. ఆయన డ్యూటీకి వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో జ్యోతి ఈ అఘాయిత్యానికి పాల్పడిందన్నారు. వీరికి వివాహమై మూడేళ్లయినా సంతానం కలగలేదని బాధ ఉండేదని సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నీటిలో ఈదలేక గేదె మృతి

రైల్వే అండర్ బ్రిడ్జిలో 15 అడుగుల మేర నీటి నిల్వ

పొలాలకు వెళ్లేందుకు తుమ్మల గ్రామ రైతుల ఇబ్బందులు



గేదె కళేబరం

ధర్మవరంరూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రైల్వే అండర్ బ్రిడ్జి నీటిలో ఈదలేక ఓ గేదె మృత్యువాత పడిన సంఘటన మండలంలోని తుమ్మల గ్రామసమీపంలో జరిగింది. ఇక్కడ 15అడుగుల మేర నీళ్లు నిలబడటంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తుమ్మల గ్రామ రైతులకు బ్రిడ్జి అవతల సుమారు 100ఎకరాల పొలాలు ఉన్నాయి. ప్రతిరోజు అండర్‌బ్రిడ్జిని దాటుకొని వెళ్లాల్సి ఉంటుంది. సాధారణంగా రైతులు ఆవులు, గేదెలను నీళ్లలోకి వదిలి వారు మాత్రం రైల్వేట్రాక్‌పై దాటుకుని వెళ్తారు. కొన్ని సందర్భాల్లో ఆ నీళ్లలో పశువులు రాలేక మృత్యువాత పడుతున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. శుక్రవారం గ్రామానికి చెందిన రైతు బాలిరెడ్డి తన గేదెలను తోలుకొని పొలానికి బయల్దేరాడు. రోజులాగే అండర్‌బ్రిడ్జి నీళ్లలో గేదెలు ఈదుకుంటూ అవతలి ఒడ్డుకు చేరడం ప్రారంభించాయి. అయితే ఓ గేదె ఈదలేక నీళ్లలోనే మృతిచెందింది. పాడి గేదె మృతిచెందడంతో రూ.1లక్ష వరకు నష్టం వాటిల్లిందని ఆ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదివరకే ఈ నీళ్లల్లో కాడెద్దులు, ఆవులు మృతిచెందాయని గ్రామస్థులు తెలిపారు. రైల్వేఅండర్‌బ్రిడ్జిలో నీటిని మోటర్ల ద్వారా బయటకు తోడేయాలని లేదా సమీపంలో చిత్రావతి నదిలోకి వెళ్లేలా కాలువ చేయాలని రైల్వేఅధికారులకు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

గుత్తిలో అదృశ్యం.. వైటీ చెరువులో మృతదేహం



విజయలక్ష్మి (ఫైల్)

గుత్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన గుత్తి ఆర్ఎస్‌కు చెందిన విజయలక్ష్మి(54) గుంతకల్లు మండలం వైటీ చెరువులో మృతదేహమై తేలింది. రామాంజనేయులురెడ్డి భార్య విజయలక్ష్మి రెండు రోజుల క్రితం గుత్తిఆర్ఎస్‌లోని ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుమారుడు లక్ష్మీకాంతరెడ్డి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రామారావు, ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం ఆమె వెళ్లిన పొలం ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. అక్కడ రక్తపు మరకలు, మద్యం బాటిళ్లు కనిపించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అనంతపురం నుంచి డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంను రప్పించి పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎలాంటి ఆధారం దొరకలేదు. ఈ నేపథ్యంలో గుంతకల్లు మండలం వైటీ చెరువులో విజయలక్ష్మి మృతదేహం శుక్రవారం తేలింది. ఆమె ముఖం పూర్తిగా ఉబ్బిపోయి ఉంది. కుటుంబీకుల సహకారంతో ఆమె విజయలక్ష్మిగా గుర్తించారు. ఈమెది ఆత్మహత్యా, హత్యా.. అన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. మృతదేహాన్ని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ కేసును గుత్తి పోలీసులు దర్యాప్తు చేస్తారా.. గుంతకల్లు రూరల్ స్టేషన్ సిబ్బందా.. అన్నది తేలాల్సి ఉంది.

దివ్యాంగులకు భరోసా

వందశాతం రాయితీతో త్రిచక్ర వాహనాలు

అన్‌లైన్‌లో దరఖాస్తులు... ఈనెల 30 వరకు గడువు

శింగనమల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు తీపికబురు చెప్పింది. త్రిచక్ర వాహనాలను వందశాతం సబ్సిడీతో ఇవ్వనుంది. అందుకు దరఖాస్తులు స్వీకరిస్తోంది. దరఖాస్తు గడువును ఈనెల 30 వరకు పొడిగించింది. పదో తరగతి ఉత్తీర్ణులై, స్వయం ఉపాధి పొందుతున్న, ప్రైవేటు ఉదోగ్యం చుస్తున్న విభిన్న ప్రతిభావంతులు అర్హులు. డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులు కూడా వీటిని పొందవచ్చు. addacacgov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సంబంధిత అధికారులు తెలిపారు.

అర్హతలు

- ఒకటి లేదా రెండు కాళ్లు ప్రభావితమైన 70 శాతం వైకల్యం ఉన్నవారు
- రెండు చేతులు సక్రమంగా ఉండాలి
- 18నుంచి 45 ఏళ్లపు వయసు ఉండాలి
- ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ద్వారా ఇంతకు మునుపు వాహనాలు తీసుకోకూడదు
- డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరి
- వార్షిక ఆదాయం రూ.3 లక్షలులోపు ఉండాలి
- తెల్లరేషన్ కార్డు తప్పనిసరి
- ఆధార్, రేషన్‌కార్డు, 10వ తరగతి మార్కుల జాబితా, వైకల్యానికి సంబంధించిన సదరం సర్టిఫికెట్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ప్రస్తుతం అందుతున్న పింఛన్ పుస్తకం సమర్పించాలి.
- డ్రైవింగ్ లైసెన్స్, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్, అంగవైకల్యం చూపే విధంగా ఉన్న ఫొటోలను జత చేస్తూ సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో శుక్రవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.15వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 20టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

ఇప్పటికే చేసేశారు..!

ఇంటి దరఖాస్తులకు ఆన్‌లైన్‌లో ఎర్రర్
అభ్యర్థులకు తెలియకుండానే దరఖాస్తులు
నేటికీ ఇళ్లు, స్థలాలు రాక ఇబ్బందులు
హౌసింగ్ సర్వేలో గత ప్రభుత్వ నిర్వాకాలు వెలుగులోకి..
ఆందోళనలో నూతన దరఖాస్తుదారులు



సచివాలయంలో సర్వే దరఖాస్తు చేసుకుంటున్న అభ్యర్థులు

అనంతపురం వైద్యం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): హెచ్చరిక..! ఇప్పటికే మీరు ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నారు. మీ ఆధార్ నంబర్‌తో దరఖాస్తు చేసుకోవడం కుదరదని ఆన్‌లైన్‌లో మేసేజ్ వస్తుండటంతో దరఖాస్తుదారులు అవాక్కవుతున్నారు. ఇప్పటి వరకు మేము దరఖాస్తు చేసుకోనేలేదు. గత ప్రభుత్వంలో వలంటీర్లు ఆధార్ కార్డులు అడిగితే ఇచ్చాం అంతే అని చెబుతున్నారు. అయినా ఇల్లు రాలేదు, స్థలం ఇవ్వలేదు. ఇదెక్కడి అన్యాయమని వారు వాపోతున్నారు. అందరికి సొంత ఇళ్ల నినాదంతో కూటమి ప్రభుత్వం ఈనెల 10నుంచి హౌసింగ్ సర్వే నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. గృహనిర్మాణ సంస్థ డిప్యూటీ ఇంజనీర్(డీఈ), అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ)లు సచివాలయ సిబ్బందితో కలిసి గ్రామాల్లో సర్వే చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామ పంచాయతీల వారిగా ప్రతి కుటుంబం వద్దకెళ్లి మీకు స్థలం ఉందా? సొంత ఇల్లు ఉందా? అని వివరాలు సేకరిస్తున్నారు. ఇల్లు, స్థలం లేనివారికి కొత్తగా మంజూరు చేసేలా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అయితే దరఖాస్తుదారుల ఆధార్ నంబర్‌ను ఆన్‌లైన్ యాప్, పోర్టల్లో ఎంటర్ చేయగానే హెచ్చరిక..! అంటూ ఇదివరకే దరఖాస్తు చేసినట్లు మేసేజ్ వస్తోంది. దీంతో ఇల్లు, స్థలం మంజూరు అవుతుందా? లేదా? అని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లోనే స్థలం, ఇల్లు

లక్షల మందికి జగనన్న ఇంటి స్థలాలు కేటాయించి సొంత ఇళ్లను నిర్మించామని గత వైసీపీ ప్రభుత్వం ప్రచారం చేసుకుంది. అయితే ఇదంతా కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే ఉందని బాధిత వర్గాలు మండిపడుతున్నాయి. గత ప్రభుత్వ నిర్వాకంతో నేటికీ అద్దె ఇళ్లు, గుడిసెల్లోనే జీవనం సాగిస్తున్నామని వాపోతున్నారు. ఊరందరికీ ఇస్తే జగనన్న స్థలాలు, ఇళ్లు ఏమైయ్యాయని ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వంలోని దరఖాస్తులను డిలిట్ చేసి, ప్రస్తుత సర్వేలో అప్లికేషన్ తీసుకోవాలని, ఆమేరకు స్థలం, ఇల్లు మంజూరు చేయాలని బాధితులు వేడుకుంటున్నారు.

మీరింకా అప్‌డేట్ కాలేదు

ప్రస్తుత హౌసింగ్ సర్వేలో అనేకమంది దరఖాస్తులను ఆన్‌లైన్‌లో తీసుకోవడంలేదు. మీ ఆధార్‌కు ఫోన్ నంబర్ లింక్ కాలేదని, ఫింగర్ ప్రింట్, ఐరిష్ అప్‌డేట్ కాలేదని ఎర్రర్ చూపిస్తోంది. అదేవిధంగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను పొందలేదని ఎర్రర్ వస్తోంది. ఇలా ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో దరఖాస్తులు ఇలాంటి ఎర్రర్‌లు వస్తున్నట్లు సర్వేలో పాల్గొంటున్న సిబ్బంది చెబుతున్నారు. సొంత స్థలం, ఇల్లు లేక చాలా జంటలు వారి తల్లిదండ్రుల ఇళ్లలోనే కాపురముంటున్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైనా దరఖాస్తు చేయలేని పరిస్థితి. అప్‌డేట్ చేసుకోవడానికి దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగేస్తే అర్హులకు న్యాయం చేయవచ్చునని సర్వే వర్గాలు వివరిస్తున్నాయి.

ఒక్కరోజే 8వేలు..

సర్వే ప్రారంభమైన 10 తేదీ నుంచి 18రోజుల్లో 33వేల కుటుంబాలను సర్వేచేశారు. శుక్రవారం ఒక్కరోజులోనే 8వేల కుటుంబాలను సర్వేచేసినట్లు గృహనిర్మాణ సంస్థ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అన్ని గ్రామాల్లోనూ సర్వే పూర్తి చేశామని ప్రభుత్వానికి నివేదిక పంపడానికి ఇలా చెబుతున్నారా? లేక గత ప్రభుత్వంలో చేసిన తప్పిదాలనే మార్గదర్శకంగా తీసుకున్నారా? అనే అనుమానాలు ఉత్పన్నమౌతున్నాయి. క్షేత్రస్థాయిలో సిబ్బందికి ఎదురౌతున్న సమస్యలకు అధికారులు చెబుతున్న వివరాలకు పొంతనలేదని గణాంకాల పరిశీలక వర్గాలు విశ్లేషిస్తున్నాయి. శని, ఆదివారం వరకు సర్వేగడువు ఉన్నప్పటికీ సమస్యలు పరిష్కారం కావని పేర్కొంటున్నాయి.

దంపతుల్లో ఒకరు..

నూతన ఇల్లు, స్థల దరఖాస్తులకు కుటుంబంలోని భార్య, భర్త ఇద్దరూ అర్హులే. భార్య ఆధార్ నంబర్‌కు ఎర్రర్ వచ్చినప్పుడు భర్త ఆధార్ నంబర్‌తో దరఖాస్తు చేయాలి. భర్త ఆధార్‌కు ఎర్రర్ వస్తే భార్య ఆధార్‌తో ఎన్‌రోల్ చేయాలి. వెరిఫికేషన్‌లో అర్హులుగా గుర్తిస్తే ఇల్లు మంజూరు అవుతుంది. జిల్లాలో ఎన్ని కుటుంబాలున్నాయి, వీటిలో ఎన్ని కుటుంబాలకు సొంత ఇల్లు, స్థలం లేదని సర్వే చేస్తున్నాం.

- శైలజ, జిల్లా గృహనిర్మాణ సంస్థ అధికారి

రూ.10 వేల లంచానికి ఏడేళ్ల జైలు

కర్నూలు ఏసీబీ కోర్టు తీర్పు

అనంతపురం క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): లోన్ సెటిల్‌మెంట్ కోసం రూ.10వేలు లంచం తీసుకున్నందుకు ఓ అధికారికి ఏడేళ్ల జైలు, లక్ష జరిమానా పడింది. ఈ మేరకు కర్నూలు ఏసీబీ స్పెషల్ కోర్టు న్యాయాధికారి శుక్రవారం తీర్పు వెలువరించారు. కదిరి ప్రాంతం జోకుపాలెంకు చెందిన షైక్ షామీర్ బాషా అత్తకు ఏపీ కో -ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఫెడరేషన్ లిమిటెడ్ రూ.1.20 లక్షల రుణం మంజూరు చేసింది. ఆమె లోన్ మొత్తాన్ని తిరిగి చెల్లించలేకపోయింది. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కోసం ఏపీ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఫెడరేషన్ లిమిటెడ్ అనంతపురం అసిస్టెంట్ రిజిస్ట్రార్ సుబ్బయ్యను సంప్రదించగా లంచం అడిగారు. దీంతో బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించా రు. ఆ అధికారి బాధితుల నుంచి రూ.10 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు 2013 మే 3న రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి, కర్నూలు ఏసీబీ ప్రత్యేక కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేసిన న్యాయస్థానం ముద్దాయి సుబ్బయ్యకు ఐదేళ్ల జైలు, రూ. లక్ష జరిమానా విధించింది. జరిమానా చెల్లించకుంటే ఆరు మాసాల సాధారణ జైలు శిక్ష విధించబడుతుందని న్యాయాధికారి పేర్కొన్నారు. అలాగే పీసీ యాక్ట్ 1988లోని సెక్షన్ 13(2), ఆర్/డబ్ల్యూ 13(1)(డి) కింద 7 ఏళ్ల జైలు, రూ.1లక్ష జరిమానా విధించారు. ఈ రెండు శిక్షలు ఒకేసారి అమల్లోకి వస్తాయని, జరిమానా మొత్తంలో నుంచి రూ.10 వేలు ఫిర్యాదుదారుడికి పరిహారంగా ఇవ్వాలని న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

7న ఎన్ఎంఎంఎస్ పరీక్ష

కొత్తచెరువు/అనంతపురం విద్య, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎన్ఎంఎంఎస్(నేషనల్ మెరిటి మీన్స్ స్కాలర్‌షిప్) పరీక్ష డిసెంబరు 7న నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా విద్యాశాఖాధికారులు శుక్రవారం ప్రకటనలో తెలాపారు. పరీక్షలు ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకు జరుగుతాయన్నారు. విద్యార్థులు హాల్‌టిక్కెట్లను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల వెబ్‌సైట్ www.bse.gov.in లోగానీ, వాట్సాప్-మనమిత్రాలోగానీ డౌన్‌లోన్ చేసుకోవాలన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాల యు-డైసి లాగిన్‌లో విద్యార్థులకు హాల్‌టికెట్లను అందజేయాలన్నారు. హాల్‌టిక్కెట్‌లోని క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేయడం వల్ల విద్యార్థి పరీక్షాకేంద్రాన్ని తెలుసుకోవచ్చని తెలిపారు. పరీక్షా కేంద్రానికి గంట ముందుగా విద్యార్థులు చేరుకోవాలని సూచించారు.

పది పరీక్షల ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

అనంతపురం విద్య, నవంబరు28(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరంలో పదోతరగతి పరీక్షల ఫీజు చెల్లింపు గడువును పొడిగించినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ వెంకటేశులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 6వరకు సాధారణ రుసుంతో పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు. డిసెంబరు 7నుంచి 9 వరకు రూ.50, డిసెంబరు 10 నుంచి 12 వరకు రూ.200.., 13నుంచి 15 వరకు రూ.500 అపరాధ రుసుంతో ఫీజు చెల్లించవచ్చని డీఈఓ, ఏసీ తెలిపారు.

గొర్రెల కాపరిపై దాడి



దాడిలో గాయపడిన ఆంజనేయులు

కళ్యాణదుర్గం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వాహనానికి గొర్రెలు అడ్డుగా వచ్చాయని కాపరి ఆంజనేయులుపై విక్రం అనే వ్యక్తి దాడి చేశారు. కళ్యాణదుర్గం మండలం బోరంపల్లికి చెందిన ఆంజనేయులు, తన గొర్రెల మందను మేత కోసం శుక్రవారం సమీప గ్రామ పరిసర ప్రాంతానికి తీసుకెళ్లాడు. గొర్రెలను సాయంత్రం తిరిగి తీసుకువచ్చే క్రమంలో ప్రధాన రహదారిని దాటిస్తుండగా అనంతపురం నుంచి కళ్యాణదుర్గం వైపు విక్రం వాహనం వచ్చింది. వాహనానికి గొర్రెలు అడ్డుగా రావడంతో కాపరిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ క్రమంలో వాగ్వాదం జరిగి ఆంజనేయులుపై దాడి చేశారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్థులు, వాహనాన్ని అడ్డుకుని, విక్రంను నిలదీశారు. పోలీసులకు సమాచారం అందడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. బాధితుడి నుంచి ఫిర్యాదు స్వీకరించి, కేసు నమోదు చేశారు. గాయపడ్డ గొర్రెల కాపరి ఆంజనేయులు కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాడు. దాడి చేసిన విక్రం మాజీ ఎమ్మెల్యే బండి హులికుంటప్ప తనయుడు.

ప్రియురాలు మోసగించిందని

యువకుడి ఆత్మహత్య

మడకశిర రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రేమించిన అమ్మాయి మోసగించిందని మడకశిర మండలం హరేసముద్రం గ్రామానికి చెందిన రాజు(24) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు, తిరుపతి ఎస్వీ యూనివర్సిటిలో రాజు పీజీ పూర్తి చేశాడు. ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. చదువుకునే రోజుల్లో ఓ అమ్మాయిని ప్రేమించాడు. ఆమె మోసగించిందని బాధపడేవాడు. ఈ క్రమంలో గురువారం తిరుపతి నుంచి స్వగ్రామానికి వచ్చాడు. తన ప్రియురాలు మోసగించినందుకే బలవన్మరణానికి పాల్పడుతున్నానని సూసైడ్ నోట్ రాసిపెట్టి, శుక్రవారం తన ఇంట్లో ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించేలోగా ప్రాణాలను కోల్పోయాడు. దీంతో వారు కన్నీరుమున్నీరుగా విలపించారు. తండ్రి రామచంద్రప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అందరితో సమంగా దివ్యాంగులు

పారా స్పోర్ట్స్‌మీట్‌లో డీఈఓ కిష్టప్ప



లాంగ్‌జంప్ చేస్తున్న దివ్యాంగ విద్యార్థి

కొత్తచెరువు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): క్రీడలలో అందరితో సమానంగా దివ్యాంగ విద్యార్థులు రాణిస్తున్నారని డీఈఓ క్రిష్టప్ప తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో దివ్యాంగ విద్యార్థులకు పారా స్పోర్ట్స్‌మీట్‌ను శుక్రవారం ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈస్పోర్ట్స్‌మీట్‌కు జిల్లా నలుమూలల నుంచి 140 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. అండర్-17, 19 విభాగాలలో 400, 100, 200 మీటర్ల పరుగు పందేలను బాలురు, బాలికలకు వేర్వేరుగా నిర్వహించారు. షాట్‌పుట్, లాంగ్‌జంప్, హైజంప్ అండర్-17, 19 విభాగాల్లో బాలురు, బాలికలకు విడివిడిగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన దివ్యాంగ విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు ప్రశంసాపత్రాలను డీఈఓ అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీసీ దేవరాజ్ పాల్గొన్నారు.

పూలే సేవలు చిరస్మరణీయం

జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



నివాళులు అర్పిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం న్యూటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మహిళా విద్య, సాధికారతకు జ్యోతిరావ్ పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ పేర్కొన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని పూలే దంపతుల విగ్రహాల వద్ద బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. పూలే దంపతుల విగ్రహాలకు జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఆమె మాట్లాడుతూ.. జ్యోతిరావ్ పూలే.. మహిళా విద్యకు ప్రాధాన్యమిచ్చారన్నారు. మహిళా సాధికారతకు ఎంతో కృషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శివశంకర్, ఏఓలు బాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సెలవులో దేవదాయ శాఖ ఏసీ

ఇన్‌చార్జి ఏసీగా సుధారాణి

అనంతపురం టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): దేవదాయ ధర్మదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ (ఏసీ) తిరుమలరెడ్డి వ్యక్తిగత పనుల నేపథ్యంలో నెలరోజులపాటు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో జిల్లాకేంద్రంలోని పాతూరు చెన్నకేశవస్వామి ఆలయ ఈఓ సుధారాణికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆమె శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఏసీని ఉమ్మ డి జిల్లా అర్చక సమాఖ్య నాయకులు శాలువా కప్పి సత్కరించారు. అర్చకులకు రైతు భరోసా, అమ్మ ఒడి వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు, నాయకులు పాల్తూరు విజయ్, శ్రీనివాసులు, కేబీసీ రాయల్, శివశంకర్, తిరుపతయ్య పాల్గొన్నారు.

పాత ఖాతాల్లో నగదు తీసుకోండి: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తగిన ఆధారాలతో పాత ఖాతాల్లోని నగదును ఖాతాదారులు తీసుకోవాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ సూచించారు. ఆర్‌బీఐ చేపట్టిన మీ డబ్బు-మీహక్కు కార్యక్రమం ద్వారా పదేళ్లుగా లావాదేవీలు లేని బ్యాంకు ఖాతాల నుంచి ప్రజలు తమ డబ్బును తిరిగి తీసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు సంబంధించి శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 2,88,083 లావాదేవీలు నిలిచిపోయిన ఖాతాలు ఉన్నాయని వాటిలో రూ.66.95కోట్లు అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లుగా ఉన్నట్లు తెలిపారు. ఈనిధులు సంబంధిత బ్యాంకు హెడ్ ఆఫీసుల నుంచి ఆర్‌బీఐకి బదిలీ అయినట్లు పేర్కొన్నారు. ఈ డబ్బును తిరిగి పొందేందుకు అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు ఉన్నవారు ఆధార్, పాన్, పాస్‌పోర్టు ఫొటోతో సమీప బ్యాంకు శాఖల్లో సంప్రదించాలన్నారు. ఖాతాదారుడు మరణించిన సందర్భంలో వారసులు డెత్ సర్టిఫికెట్, కుటుంబ సభ్యుల అంగీకార పత్రంతో పాటు బ్యాంకు కోరిన ఇతర ఆధారాలను సమర్పించి, అన్‌క్లెయిమ్డ్ నగదును పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం రమణకుమార్, సీపీఓ విజయకుమార్ పాల్గొన్నారు.

సుబ్బరాయసాగర్‌ను పరిశీలించిన జేసీ



అధికారులతో మాట్లాడుతున్న జేసీ

పుట్లూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బరాయసాగర్‌ను జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మొరాయించిన గేట్‌ను పరిశీలించి సమస్యను అడిగి తెలుసుకున్నారు. గేట్ మొరాయించడంతో అరకొరగా వచ్చే నీటిని చూశారు. గేట్ మరమ్మతులు చేసి, రైతులకు ఇబ్బందులు లేకుండా సమస్యను పరిష్కరించాలని హెచ్చెల్సీ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట హెచ్చెల్సీ ఏఈ శ్రీనివాసులు, సిబ్బంది ఉన్నారు.

త్వరలో ఏడీసీసీబీలో ఓటీఎస్



అప్కాబ్ మహాజన సభలో పాల్గొన్న ముంటిమడుగు కేశవరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పేరుకుపోయిన బకాయిల వసూళ్లు, ఎన్‌పీఏ తగ్గింపునకు త్వరలో ఏకకాల రుణచెల్లింపు (ఓటీఎస్) అమలు చేసి పరిష్కరిస్తామని ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి తెలిపారు. రాజధాని అమరావతిలో శుక్రవారం జరిగిన బ్యాంకుల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి భూమిపూజలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆప్కాబ్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక మహాజనసభలో పాల్గొన్నారు. ఏడీసీసీ బ్యాంకు, సొసైటీలలో పేరుకుపోయిన మొండిబకాయిలు, ఎన్‌పీఏ తగ్గించేందుకు ఏకైక పరిష్కార మార్గం ఏకకాల రుణ చెల్లింపు(ఓటీఎస్)అమలు చేయడంపై ఆప్కాబ్ ఉన్నతాధికారులతో చైర్మన్ చర్చించారు. త్వరలో ఓటీఎస్ ద్వారా రుణ పరిష్కారం చేపడుతామని చైర్మన్ తెలిపారు.

సబ్‌జైలు తనిఖీ

పెనుకొండ టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పెనుకొండ సబ్‌జైలును లోక్ అదాలత్ చైర్మన్, సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వాసుదేవన్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఖైదీల సమస్యలు విచారించి వారికి అందుతున్న సదుపాయాలపై ఆరాతీశారు. అనంతరం న్యాయసహాయం, ఉచిత లాయర్ సహాయం తదితర వాటిపై అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో ఉన్నవారికి తక్షణం ఆరోగ్య పరీక్షలు చేయించాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు నాగిరెడ్డి, విక్రాంత్ తదితరులు పాల్గొన్నారు.



సౌకర్యాలపై ఆరాతీస్తున్న వాసుదేవన్

పరిశ్రమల ఏర్పాటుకు

సత్వర చర్యలు : కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం 64వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ(డిస్ట్రిక్ ఇండస్ట్రీస్, ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ) సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చే పారిశ్రామికవేత్తలను అన్ని రకాలుగా ఆయా శాఖల అధికారులు ప్రోత్సహించి పరిశ్రమల ఏర్పాటుకు సత్వర చర్యలు తీసుకోవాలన్నారు.

అరటి ధర తగ్గకుండా చూడాలి

జిల్లాలోని అరటి వ్యాపారులు, ఎగుమతి దారులు, ఉద్యానశాఖ అధికారులతో ధర నియంత్రణపై కలెక్టరేట్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... అరటి కిలోకు రూ.6లకు తగ్గకుండా రైతుల నుంచి కొనుగోలు చేయాలని, ఎగుమతి దారులు ఇతర దేశాల మార్కెట్‌కు కిలో రూ.8లకు తగ్గకుండా కొనుగోలు చేసి ఎగుమతి చేయాలని సూచించారు.

5న మెగా పీటీఎం

జిల్లా వ్యాప్తంగా డిసెంబరు 5న మెగా పీటీఎం(పేరెంట్స్ టీచర్స్‌మీటింగ్) 3.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. 1 నుంచి ఇంటర్ వరకు అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, సంస్థల్లో మోడల్ స్కూళ్లలో, కేజీబీవీ, ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ సంస్థల్లో పీటీఎం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామన్నారు. మొత్తం 1752 పాఠశాలలు, కళాశాలల్లో పీటీఎం నిర్వహిస్తుండగా, మొత్తం 2,15,504 మంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల గడువు

జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల గడువును మరో రెండు నెలలు పొడిగించినట్లు కలెక్టర్ ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 1 నుంచి 2026 జనవరి 31 వరకు లేదా నూతన అక్రెడిటేషన్‌లు జారీ ప్రక్రియ పూర్తి అయ్యే వరకు ఏది ముందు జరిగితే అప్పటిరకు పొడిగింపు ఉంటుందని ఉత్తర్వులు జారీ చేసినట్లు పౌర సంబంధాల శాఖ సంచాలకులు కేఎస్ విశ్వనాథన్ తెలిపారు.

ప్రతి చిన్నారి ఆరోగ్యవంతంగా ఉండాలి అనంతపురం వైద్యం: అంగన్‌వాడీ కేంద్రాలద్వారా పౌష్టికాహారాన్ని తీసుకునే ప్రతి చిన్నారి ఆరోగ్యంగా ఉండాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఐసీడీఎస్ అధికారులతో జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ పీఎంఎంవీవై ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు పంపిణీ చేయాలన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

శేఖర్ రాజీవని (పుట్టినరోజు)



బాలీవుడ్‌లో రెండు దశాబ్దాలకుపైగా పేరొందిన విశాల్-శేఖర్ సంగీత ద్వయంలో శేఖర్ ఒకరు. సినీ గాయకుడు శేఖర్ రాజీవని 1978 నవంబరు 29న గుజరాత్ రాష్ట్రం కచ్ జిల్లా భుజ్ ప్రాంతంలో జన్మించారు. గాయకుడిగా, సంగీత దర్శకుడిగా, రికార్డింగ్ ప్రొడ్యూసర్‌గా, నటుడిగా రాణించారు. బాలీవుడ్‌కే పరిమితం కాకుండా తెలుగు, మరాఠీ, ఆంగ్ల పాటలను రికార్డు చేశారు. బుల్లితెరపై పలు సంగీత కార్యక్రమాలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. మిర్చి మ్యూజిక్ అవార్డు, ఫిల్మ్‌ఫేర్, స్టార్‌డస్ట్ అవార్డ్ తదితర పురస్కారాలు అందుకున్నారు.

ఫవాద్ ఖాన్ (పుట్టినరోజు)



ఫవాద్ అఫ్జల్‌ఖాన్ 1981 నవంబరు 29న జన్మించారు. పాకిస్థానీ నటుడు, నిర్మాత, స్క్రీన్‌రైటర్‌గా, మోడల్‌గా, గాయకుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలి. బుల్లితెరపై 250కుపైగా ప్రదర్శనలు ఇచ్చాక వెండితెరపై సత్తా చాటుకున్నారు. అత్యధిక రెమ్యూనరేషన్ నటులలో ఒకరిగా ఎదిగారు. ఉత్తమ నటుడిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డు పొందారు. ఛారిటీ సంస్థలకోసం కృషి చేశారు. భార్యతో కలసి దుస్తుల సంస్థను ఏర్పాటు చేసి రాయబారిగా వ్యవహరిస్తున్నారు. ఆరు హమ్ అవార్డ్స్, ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్, 3 లక్స్ స్టైల్ అవార్డ్స్ ఇతరత్రా అవార్డులు పొందారు.

1న అంగన్‌వాడీల నిరసన

బాగేపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వివిధ డిమాండ్లను సాధించుకునే దిశగా డిసెంబరు 1న కేంద్రమంత్రి శోభాకరంద్లాజె బెంగళూరు నివాసం వద్ద నిరసన చేపట్టాలని నిర్ణయించినట్టు అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం (సీఐ టీయూ) జిల్లా కార్యదర్శి, తాలూకా అధ్యక్షురాలు కే రత్నమ్మ తెలిపారు. పట్టణంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఐసీడీఎస్ పథకం 50ఏళ్ల సువర్ణ మహోత్సవాన్ని కేంద్రప్రభుత్వం ఆచరించాలన్నారు. పథకం కోసం ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని, కార్యకర్తలను పర్మనెంట్ చేయా లన్నారు. తాలూకాలో 384 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయన్నారు. బాపల్లి, చేళూరు తాలూకాలలో 5 హోబళిలో మిట్టేమరి, పాతపాళ్య, చేళూరు, గూళూరు హోబళి కేంద్రాలు ఉన్నాయని, 450కుపైగా గ్రామాలు ఉన్నాయన్నారు. తాలూకాలో 357 అంగన్‌వాడీ, 24 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయన్నారు. 381మంది కార్యకర్తలు, 357మంది సహాయకులు ఉన్నారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలను మూడో, నాల్గో గ్రేడ్ ఉద్యోగులుగా పరిగణించాలన్నారు. తమ డిమాండ్ల సాధనకోసం డిసెంబరు 1న అంగన్‌వాడీ కేంద్రాలను మూసివేసి నిరసన చేపడుతున్నట్టు తెలిపారు. మీడియా సమావేశంలో అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షుడు జీఎం లక్ష్మీదేవమ్మ తదితరులు ఉన్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

● లింగసుగూరులో కలకలం



అల్మరా తాళాలను ధ్వంసం చేసి బంగారం, నగదును ఎత్తుకెళ్లిన దొంగలు

రాయచూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగసుగూరు పట్టణంలో సీనియర్ పాత్రికేయుడైన సిద్ధనగౌడ పాటిల్ ఇంట్లో శుక్రవారం చోరీ జరిగింది. విధి నిర్వహణలో భాగంగా పగలు ఆయన ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లగా ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న ఆయన భార్య నాగమ్మ సహితం విధులకు వెళ్లింది. దీన్ని అదనుగా భావించిన దుండగులు తాళాన్ని విరగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లో ఉన్న రూ.14 లక్షల నగదు 95 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు మరో 60 గ్రాముల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. పాటిల్ తన పిత్రార్జితమైన పొలం ఒకటి అమ్మి ఇంట్లో రూ.14 లక్షలు ఉంచుకోగా వాటిని దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లింగసుగూరు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సంఘటన స్థళాన్ని పరిశీలించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వివరాలు సేకరించి దొంగల ఆచూకీ కోసం ముమ్మర వేట ప్రారంభించారు.



ప్రధాని మోదీని స్వాగతిస్తున్న గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్



రోడ్ షోలో ఉత్సాహంగా చిన్నారి

రైతు సమస్యలను పరిష్కరించండి

● పంటలకు గిట్టుబాటు ధరలు లేక అన్నదాత విలవిల ● ఆదుకోవాలని ప్రధానికి మంత్రి దినేశ్ గుండూరావ్ వినతి

బెంగళూరు, నవంబరు28(ఆంధ్రజ్యోతి): ఉడుపి జిల్లా పర్యటనకోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళూరు విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో చేరుకున్నారు. ఆయనకు రాష్ట్రప్రభుత్వం తరపున దక్షిణకన్నడ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దినేశ్ గుండూరావు స్వాగతం పలికారు. ఇదే సందర్భంలోనే రాష్ట్రంలో మొక్కజొన్న, పెసలు పంటలకు ధరలు తగ్గాయని, రైతులు సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నారని ప్రధానికి విన్నవించారు. మంత్రి దినేశ్‌గుండూరావు ప్రధానితో మాట్లాడుతూ రైతులు లక్షలాదిరూపాయలు ఖర్చు చేసి పంటలు సాగు చేశారని కనీస మద్దతుధర లేక నష్టపోతున్నారన్నారు. ఖరీఫ్‌లో 17.94లక్షల హెక్టార్లలో మొక్కజొన్న, 4.16 లక్షల హెక్టార్లలో పెసలు సాగు చేశారన్నారు. రెండింటికీ గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. చెరకు రైతును ఆదుకోవాలని కర్ణాటకలోని చక్కెర ఫ్యాక్టరీల నుంచి ఇథనాల్ సేకరణను పెంచాలని విన్నవించారు. ఈమేరకు ఒక వినతిపత్రాన్ని అందజేశారు. విమానాశ్రయంలో గవర్నర్ ప్రధానికి సాదరంగా ఆహ్వానించారు.



మంగళూరు విమానాశ్రయంలో ప్రధాని నరేంద్ర మోదీకి వినతిపత్రం అందజేస్తున్న మంత్రి దినేశ్ గుండూరావ్

కురుడుమలె వినాయకుడికి వెన్న అలంకరణ



వెన్న అలంకరణలో వినాయకుడు



అగ్రహర లే అవుట్‌లోని పటాలమ్మదేవి



నారసింహపేటలోని పటాలమ్మదేవికి అలంకరణ

ముళబాగిలు, నవంబరు28(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కురుడుమలె గ్రామంలో పురాణ ప్రసిద్ధమైన వినాయక ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం మూల విరాట్టుకు పంచామృతాభిషేకం, గణేశ హోమం జరిగాయి. అర్చకుడు వినాయకదీక్షిత్ నేతృత్వంలో పూజా కైంకర్యాలు కొనసాగాయి. భక్తాదులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. తిప్పదొడ్డి గ్రామానికి చెందిన న్యాయవాది శేషగిరి మధ్యాహ్నం భోజన వ్యవస్థ కల్పించారు. కేంద్రమాజీ మంత్రి ఆనేకల్ నారాయణస్వామి, బెంగళూరు ఉత్తర విశ్వ విద్యాలయం అకడమిక్ కౌన్సిల్ సభ్యుడు సిద్ధఘట్ట మునిస్వామిగౌడ, ముఖ్యులు ఎంఆర్ శ్రీనివాస్, కాశి, అజయ్ తదితరులు సందర్శించారు.

చింతామణి(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అగ్రహార లేఅవుట్‌లోని పటాలమ్మదేవికి మార్గశిర మాసం కాలబైర వాష్టమిని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. ఆదిదేవత నారసింహపేటలోని పటాలమ్మదేవికి అలంకరణలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

చిన్నారులను ప్రోత్సహించేందుకే ప్రతిభాకారంజి: ఎమ్మెల్యే

బంగారపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రతిభను వెలికి తీసేందుకు ప్రతిభాకారంజి కార్యక్రమం దోహదపడుతుందని, పిల్లలు ఉత్సాహంగా పాల్గొని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల పీయూ కళాశాల ఆవరణలో శుక్రవారం ఏర్పా టైన తాలూకాస్థాయి ప్రతిభా కారంజిని ప్రారంభించి మాట్లాడారు. చిన్నారుల సర్వతోముఖాభివృద్ధికి ప్రతిభాకారంజి, మక్కళమేళా, క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పోటీలలో గెలుపోటములకంటే భాగస్వామ్యులు కావడమే ప్రధానమన్నారు. ప్రతిభాకారంజిలో పాల్గొని తాలూకాస్థాయి నుంచి జిల్లాస్థాయికి, జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి, అక్కడ నుంచి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనాలని అభిలషించారు. ఈ సందర్భంగా పురసభ అధ్యక్షురాలు గోవింద, బీఈఓ శశికళ, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవికుమార్, అక్షరదాసోహ సహాయక డైరెక్టర్ యువరాజ్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఆంజనేయగౌడ, బాలికల హైస్కూల్ వైస్‌ప్రిన్సిపాల్ హనుమంత వగ్గర్ తదితరులు పాల్గొన్నారు.



పోటీల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే నారాయణస్వామి తదితరులు

పుట్టింటికి వచ్చినట్లుంది..

● పురం పర్యటనపై నారా బ్రాహ్మణి

హిందూపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): హిందూపురం రావడంతో పుట్టింటికి వచ్చినట్లుందని ఐటీ, విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ సతీమణి, హెరిటేజ్ సంస్థల ఈడీ నారా బ్రాహ్మణి అన్నారు. నియోజకవర్గంలోని చిలమత్తూరు, లేపాక్షి, హిందూపురం మండలాల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. చిలమత్తూరు జూనియర్ కళాశాల, లేపాక్షి మండలం కుర్లపల్లి, హిందూపురం మండలం పూలకుంట ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్లు, ప్రింటర్లు అదించారు. లేపాక్షి నవోదయలో సోలార్ గీజర్లను పరిశీలించారు. వీటిని హెరిటేజ్ సంస్థ ఆధ్వర్యంలో అందించినట్లు తెలిపారు. హిందూపురం అంటే నందమూరిపురమనీ, ఇక్కడి నుంచి తమ తాత నందమూరి తారకరామారావు, పెదనాన్న హరిక్రిష్ణ, తండ్రి నందమూరి బాలకృష్ణ ప్రాతినిధ్యం వహించారన్నారు. ఈ లెక్కన నందమూరి కుటుంబానికి నియోజకవర్గంతో ఎంత బలమైన బంధం ఉందో అర్థం అవుతుందన్నారు. భవిష్యత్తులో కూడా చదువుకు హెరిటేజ్ సంస్థ సహాయసహకారాలు అందిస్తుందన్నారు. విద్యార్థులు విలువలతో కూడిన విద్యను నేర్చుకుని సమాజానికి ఉపయోగపడేలా ఎదగాలన్నారు.



పూలకుంట పాఠశాలలో మాట్లాడుతున్న నారా బ్రాహ్మణి

చిలమత్తూరు, లేపాక్షి, హిందూపురం పాఠశాలల్లో నారా బ్రాహ్మణికి పుష్పగుచ్ఛాలు ఇచ్చి, ఘనంగా స్వాగతించారు. ఆమెపై విద్యార్థులు పూలు చల్లుతూ పాఠశాలలోకి ఆహ్వానించారు. పాఠశాల గదులు, లైబ్రేరీలను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, పూలకుంట సర్పంచ్ మంజునాథ్, ఎమ్మెల్యే పీఏ బాలాజీ, నాయకులు రామకృష్ణారెడ్డి, గంగాధర్, శ్రీనివాసులు, చంద్రప్ప పాల్గొన్నారు.

నగర సమస్యలపై ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే చర్చలు

రాయచూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారం కోసం సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటిల్ గురువారం సాయంత్రం నగరంలో మహానగర పాలిక కమిషన్‌ను కలిసి చర్చించారు. ఖాతాల మార్పు ఆస్తుల పన్నుల చెల్లింపు తదితర అంశాలకు సంబంధించి ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని సిటీ ఎమ్మెల్యే కోరారు. దీంతో పాటు కోట ప్రదేశం మామిడి చెరువు తదితర పబ్లిక్ స్థళాల్లో ఇప్పటికే ఉన్న అక్రమంగా వెలసిన ఇళ్లల నిర్మాణాలకు పన్నులు చెల్లిస్తున్నారని కొత్తగా అలాంటి స్థళాల్లో నిర్మాణాలకు అనుమతులు ఇవ్వరాదని సిటీ ఎమ్మెల్యే సూచించారు. అదే సమయంలో నగర స్వచ్ఛతకు సంబంధించి మైసూరు మహానగర పాలిక నమూనాను రాయచూరు మహానగర పాలికలో అమలు చేయాలని కోరారు. సమావేశంలో పాల్గొన్న రాయచూరు మహానగర పాలిక కమిషనర్ జుబిన్ మొహపాత్ర మాట్లాడుతూ ఆస్తి ఖాతాల మార్పుకు సంబంధించి సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఉన్నతాధికారులకు వివరించారు.



కమిషనర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్

5న భూతప్పల ఉత్సవం

● రేపట్నుంచి భక్తరహళ్ళి బ్రహ్మోత్సవాలు

మడకశిర రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధ భక్తరహళ్ళి నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో కీలకమైన భూతప్పల ఉత్సవం డిసెంబరు 5వ తేదీన నిర్వహించనున్నట్లు ఈఓ నరసింహరాజు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల30న బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 30న విశ్వక్సేన, రక్షాబంధన, అంకురార్పణ, 1న ధ్వజారోహణ, అగ్నిహోత్ర హోమం, 2న శ్రీమన్యుసూక్త హోమం, 3న లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం, 4న స్వామి వారి బ్రహ్మరథోత్సవం, 5న జ్యోతుల పరుష, భూతప్పల ఉత్సవం, 6న తలనీలాలు, పూలపల్లకి ఉత్సవం, 7న కంబాల నరసింహస్వామి జ్యోతుల పరుష, 8న చక్రస్నానం, వసంతోత్సవంతో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ముగియనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూలైన్లతోపాటు అన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

సోమేశ్వరస్వామి ఆలయంలో మృత్యుంజయ హోమం



విశేషపూజల్లో పాల్గొన్న భక్తులు

శిడ్లఘట్ట, నవంబరు28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటి సోమేశ్వర స్వామి ఆలయంలో షష్ఠిని పురస్కరించుకుని మూడురోజులపాటు ప్రత్యేక పూజలు కొనసాగాయి. బుధ, గురు, శుక్రవారాలలో ప్రత్యేక పూజలు, అలం కరణలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మృత్యుంజయ హోమం, వివిధ పూజా కైంకర్యాలు నిర్వహించారు. బిల్వవృక్షం కింద హోమగుండం ఏర్పాటు చేసి మృత్యుజయ హోమంచేయడం విశేషం. పూర్ణాహుతి సందర్భంగా హోమంలోకి నవధాన్యాలు సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ స్థాయి సమితి అధ్యక్షుడు డాల్ఫిన్ నాగరాజ్, సంజీవప్ప, మురళి, శ్రీనాథ్, సురేశ్ రామచంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

5న రక్తదాన శిబిరం

బెంగళూరు, నవంబరు28(ఆంధ్రజ్యోతి):హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సీఎస్ఆర్‌లో భాగంగా దేశవ్యాప్తంగా 17వ విడత డిసెంబరు 5న రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు డిప్యూటీ ఎండీ ఖైజద్ భరూచా ప్రకటించారు. దేశవ్యాప్తంగా పలు నగరాలలో ఏర్పాటు చేసిన తరహాలోనే బెంగళూరులోనూ రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ భవేశ్ జువేరి అభిప్రాయం ప్రకారం రక్తదాన శిబిరం అంటే కేవలం ప్రచారం కాదని, యువతలో చైతన్యం తీసుకొచ్చి అత్యవసర పరిస్థితుల్లో ఉండేవారికి ఒకరి ప్రాణం కాపాడేందుకు భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశ్యంతో శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. గత ఏడాది 5,533 శిబిరాల ద్వారా 3.38 లక్షల యూనిట్ల రక్తాన్ని సేకరించామన్నారు.

అద్దెకు ఎలక్ట్రిక్ వాహనాలు

బెంగళూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు అనుకూలంగా ఉండే బిలైవ్ సంస్థ 5వేల ఎలక్ట్రికల్ వాహనాలను సమకూర్చనున్నట్టు ప్రకటించింది. శుక్రవారం బిలైవ్ సంస్థ సీఈఓ కో-ఫౌండర్ సందీప్ ముఖర్జీ నగరంలో ప్రకటించారు. ఇప్పటికే పలు కంపెనీల ఎలక్ట్రికల్ వాహనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కానీ దేశంలోనే ఎలక్ట్రికల్ మొబిలిటీ ప్లాట్‌ఫాంలో బిలైవ్ ప్రముఖ సంస్థగా రాణిస్తోందన్నారు. జెప్టో, బ్లింకెట్, బిగ్‌బాస్కెట్ వంటి క్యూ కామర్స్ ప్లాట్‌ఫాంలకు సహకరిస్తోందన్నారు. బిలైవ్ ద్వారా నగరంలో మరిన్ని వాహనాలు అందుబాటులోకి రానున్నాయన్నారు. ఇప్పటికే చెన్నై, కోల్కత్తా, పూనెలలో డిమాండ్ ఉందని, అదే తరహాలో బెంగళూరులోనూ విస్తరింప చేయదలిచామన్నారు.

వైట్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ



పోటీల్లో రాణించిన విద్యార్థులు


దొమ్మసంద్ర, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ సిలబస్‌లో ఎలక్ట్రానిక్ సిటీలోని వైట్‌అకాడమీ స్కూల్ విద్యార్థులు రాణించారు. రాష్ట్ర స్థాయిలో 2,500కుపైగా స్కూల్స్ పోటీ పడగా అత్యుత్తమ విద్యా ప్రగతి సాధించింది. రాష్ట్రస్థాయిలో రెండోస్థానంలోనూ, డివిజన్ పరిధిలో మూడో స్థానంలో, జాతీయస్థాయిలో 7వ స్థానం ర్యాంకు సాధించింది. ప్రిన్సిపాల్ పూర్ణిమా మాట్లాడుతూ ఉపాధ్యాయుల మార్గదర్శకం, తల్లి దండ్రుల ప్రోత్సాహంతోనే విద్యార్థులు పలు చాంపియన్‌షిప్ పోటీల్లో తమ ప్రతిభను చాటారన్నారు. ప్రసంగం పోటీల్లో సీనియర్ విభాగంలో కావ్యగణేశ్ మాలవడ్కర్ ఛాంపియన్‌గా నిలిచింది. సైన్స్ ఛాంపియన్‌గా (సీనియర్ విభాగంలో) ఆర్యన్ శుక్లా, కోడింగ్ ఛాంపియన్‌గాను, మ్యాథ్స్ క్విజ్ ఛాంపి యన్‌గాను (సీనియర్) ఆర్యన్ శుక్లా, ఇంగ్లిష్ క్విజ్ ఛాంపియన్‌గా అనఘా ఆర్‌కే రాణించారు. జాతీయస్థాయికి ఎంపికైన ప్రతిభావంత విద్యార్థులను శుక్రవారం వైట్ అకాడమీ ముఖ్యులు ఆనేకల్ దొడ్డయ్య తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థిని సత్తా



బహుమతి సాధించిన చిత్రం, విద్యార్థినికి అభినందన

విజయపుర, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బెంగళూరు గ్రామీణ జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, సాంఘిక సంక్షేమశాఖ సంయుక్తంగా నా ఓటు నా హక్కు చిత్రలేఖనం పోటీల్లో విజయపుర పట్టణ విద్యార్థిని సత్తా చాటింది. ప్రభుత్వ ఉర్దూ హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని జునేరా హాజిర తాలూకాస్థాయిలో రూ.20వేల బహుమతి సాధించారు. అంతేకాక జిల్లాస్థాయిలో ద్వితీయ బహుమతి రూ.15వేలు బహుమతిగా అందుకుని పాఠశాల కీర్తిని ఇనుమడింపచేశారు. బాలిక జునేరా హాజిరను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాంతకుమారి, డ్రాయింగ్ టీచర్ భాను ప్రకాశ్ ప్రత్యేకంగా అభినందించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1623.18	1630.06
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,531	3,022
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,319	6,658
నీటి నిల్వ (టీఎంసీలు)	70.70	94.29

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బళ్లారి గాంధీనగర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బళ్ళారి నగర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా చేసే విప విభాగం 110/11కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో త్రైమాసిక మరమ్మతులు నిర్వహిస్తున్న కారణంగా శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిస్తున్నట్లు జెస్కాం అధికారులు ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఫీడర్ నెం 23, 24, 25, 46, 47, 48 పరిధిలోకి వచ్చే బెంగళూరు రోడ్డు, ఆంధ్రాల్, కొలిమి చౌక్, కాకర్లతోట, బాపూజీనగర్, మిల్లార్ పేట, మోతీ సర్కిల్, తేరు వీధి, పారిశ్రామిక వాడ, మహేష్ పైప్స్, లారీ టర్మినల్, జైన్ మార్కెట్, సాయి కాలనీ, ఏపంఎంసి మార్కెట్, మరిస్వామి మఠం, పెద్ద మార్కెట్, తోపిగల్లి, బొమ్మనహాల్ రోడ్డుతోపాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా కలిగిస్తున్నారు. అదేవిధంగా బళ్ళారి గ్రామీణ జెస్కాం ఉప విభాగం 110/11 కెవి దక్షిణ ఉప విద్యుత్ సబ్‌స్టేషన్ స్థలాంతరం చేస్తున్న నేపథ్యంలో నవంబరు 30వ తేదీన ఉదయం 9గంటల నుండి సాయంత్రం గంటల వరకు 11 కేవీ ఫీడర్ నెం 43 పరిధిలోని పారిశ్రామిక వాడ టపాల్ స్టీల్, సిద్దాపుర రోడ్డులో సరఫరా ఉండదన్నారు.

కేకాతిలో మారెమ్మ ఉత్సవాలు

గుడిబండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేకాతి గ్రామంలో గ్రామస్థుల ఆధ్వర్యంలో ఘనంగా మారెమ్మ ఉత్సవాలు జరిగాయి. శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. అమ్మవారికి జ్యోతులు మోసి మొక్కులు తీర్చుకున్నారు.

అఖండ బళ్లారిలో అభివృద్ధి పరుగులు

● జాతీయ రహదారితో తీరనున్న భారీ వాహనాల సమస్య ● ఎన్‌హెచ్ 67ను జాతికి అంకితం చేసిన ఎంపీ తుకారాం



జాతీయ రహదారిని ప్రారంభిస్తున్న ఎంపీ తుకారాం

బళ్లారి గాంధీనగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అఖండ బళ్లారిలో అభివృద్ధి పరుగుతు పెడుతోందని ఎంపీ తుకారాం అన్నారు. శుక్రవారం బళ్ళారి నగర శివారు ప్రాంతం వేణి వీరాపురం నుంచి హగరి వరకు నిర్మించిన జాతీయ రహదారి 67ను ఎంపీ తుకారాం.. జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖండ బళ్ళారి అభివృద్ధి వైపుపరుగులు తీస్తోందని, హొసపేట నుంచి ఆంధ్ర-కర్ణాటక సరిహద్దు వరకు మొత్తం రూ.95.370 కిలో మీటర్ల జాతీయ రహదారిని రూ.830.28 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. ఇప్పటికే 78శాతం పనులు పూర్తికాగా, హొసపేట ప్రాంతంలోని భువనహళ్ళి, వడ్డరహళ్ళి, గాదిగనూరు ప్రాంతాల్లో పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రస్తుతం 25 కిలోమీటర్ల బైపాస్ ప్రారంభించినట్లు, ఈ జాతీయ రోడ్డు సేవలు అందుబాటులోకి రావడంతో ప్రజల రాకపోకలకు అనువుగా ఉంటుందన్నారు. అదేరీతిలో నగరంలోని కొత్త బైపాస్ రోడ్డు నుంచి సుధాక్రాస్ ద్వారా కౌల్ బజార్‌వరకు ఫోర్-లేన్ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు డీపీఆర్ సిద్ధం చేసినట్లు తెలిపారు. సుధాక్రాస్ రైల్వే ఫ్లైఓవర్ పనులు ప్రగతి దశలో ఉన్నాయన్నారు. దుర్గమ్మ గుడి ఫ్లై ఓవర్ పనులు విస్తరించేందుకు బళ్ళారి నగరాభివృద్ధి ప్రాధికార ఇప్పటికే రైల్వే శాఖకు రూ.9కోట్లు డిపాజిట్ చేసిందని, ఈ విషయంపై సంబంధిత అధికారులతో చర్చిస్తున్నట్లు తెలిపారు. బళ్ళారి చుట్టూ పూర్తి స్థాయిలో రింగ్ రోడ్డు నిర్మాణమైతే నగరంలోకి భారీ వాహనాల రాకపోకల సంచారం తగ్గుతుందన్నారు. కుడితిని, వేణివీరాపుర ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపనకు రైతుల నుండి స్వాధీనం చేసుకున్న 2,659 ఎకరాల భూమిలో అర్సెల్ మిత్తల్, ఎన్ఎండీసీ, ఉత్తమ గాల్వ కంపెనీలు పరిశ్రమలు స్థాపించలేదని, ఎన్ఎండిసి మాత్రం త్వరలో పరిశ్రమ స్థాపించనున్నట్లు, ఉత్తమ్ గాల్వా కంపెనీ మార్చి నెలలో పరిసర స్నేహి పరిశ్రమ స్థాపించేందుకు రూ 36వేల కోట్లు పెట్టుబడులతో యోజనను రూపొందించినట్లు, ఈ విషయంపై ముఖ్యమంత్రితో చర్చించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ గాదెప్ప, జిల్లా గ్యారెంటీ యోజన అనుష్టాన ప్రాధికార అధ్యక్షుడు కేఈ చిదానందప్ప, ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఆనంద్, కార్పొరేషన్ సభ్యులు జాతీయ రోడ్డు అభివృద్ధి ప్రాధికార అధికారులు, కాంట్రాక్టర్లు, నిర్మితకేంద్రం అధికారులు పాల్గొన్నారు.

ఎంఆర్ఐ సేవలు ప్రారంభించిన ఎంపీ



ఎంఆర్ఐ స్కానింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎన్ఎండీసీ డైరెక్టర్ ఛటర్జీ తదితరులు

పేద ప్రజల కష్టాలను దృష్టిలో పెట్టుకుని ఎన్ఎండీ సంస్థ తన సీఎస్ఆర్ ఫండ్స్‌తో రూ.12 కోట్లతో జిల్లా ఆసుపత్రిలో ఎంఆర్ఐ స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం సంతోషించ దగ్గ విషయయని, జిల్లా ప్రజలకు ఇదొక వరమని ఎంపీ తుకారం అన్నారు. ఆసుపత్రిలో ఎంఆర్ఐ స్కానింగ్ యంత్రాన్ని ఆయన ప్రారంభించారు. సిఎస్ఆర్ నిధులతో విద్య, ఆరోగ్యం, స్కిల్స్ అభివృద్ధికి ఖర్చుచేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో సీఎస్ఆర్ ఫండ్ ఎన్నో అభివృద్ధి పనులకు ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జడ్పీ సీఈఓ మాట్లాడుతూ.. జిల్లా ఆసుపత్రిలో కొత్తగా ప్రారంభించిన ఎంఆర్ఐ స్కానింగ్ సేవలు పేద ప్రజల ఆర్థిక భారాన్ని తగ్గించినట్లు అయిందని, బీపీఎల్ కార్డు దారులకు రూ.1150తో ఎంఆర్ఐ స్కానింగ్ సేవలు లభించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎండీసీ జనరల్ మేనేజర్ చటర్జి, డీహెచ్ఓ డాక్టర్ రమేష్ బాబు, జిల్లా సర్జన్ బసరెడ్డి, మేయర్ పి.గాదెప్ప, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

బళ్ళారి నగరంలోని రాఘవేంద్ర కాలనీలో ఎంపీ నిధుల రూ 25లక్షు వెచ్చించి నిర్మిస్తున్న ఫుట్‌పాత్, పిరమిడ్ కేంద్రం నిర్మాణానికి ఎంపీ శుక్రవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. నడకతో సంపూర్ణ ఆరోగ్యం సాధమ్యమని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ సూచించారు. ఈ సందర్భంగా లిడ్‌కర్ అధ్యక్షులు ముండరిగి నాగరాజు, కార్పొరేటర్ కుబేరలతో పాటు పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సీఎం, డీసీఎం దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

రెండో పంటకు నీరివ్వాల్సిందే..

● లేదంటే ఎకరాకు పాతిక వేల పరిహారం ఇవ్వాలి
● బళ్లారిలో బీజేపీ నాయకుల ఆందోళన

బళ్లారి సిటీ/రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఆయకట్టు ప్రాంతానికి రెండవ పంటకు నీరు ఇవ్వాలని, లేకుంటే పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ నగరంలో శుక్రవారం భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య, డీసీఎం, డికే. శివకుమార్, తుంగభద్ర నీటిపారుదల సలహా కమిటీ అధ్యక్షుడు శివరాజ్ తంగడగి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఎద్దులబండిలో గడిగ చెన్నప్ప సర్కిల్‌కు చేరుకున్న బీజేపీ నాయకులు మానవహారం ఏర్పాటు చేసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుంగభద్రకు నీరు ఇవ్వకపోతే ఎకరానికి రూ.25,000 పరిహారం అని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలుచేశారు. శాసనమండలి సభ్యులు, రవికుమార్, వైఎం సతీస్, నగర మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కుర్చీల పోరు మానేసి రైతుల సమస్యలపై దృష్టి పెట్టాలని, ఓ వైపు వర్షకాలంలో పండించిన మొక్కజొన్న పంట ధర పడిపోయింది. మరోవైపు జలాశయం నుంచి నీటిని విడుదల చేయకుండా వేసవి వరి పండించడానికి నీరు లేకపోవడంతో రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ఈసందర్భంగా పార్టీ నాయకులు కే.ఏ,రామలింగప్ప, డా.మహిపాల్, గురులింగనగౌడ, గుత్తిగనూరు విరూపాక్షగౌడ, గణపాల్ ఐనాథ్ రెడ్డి, హనుమంతప్ప, డాక్టర్ అరుణ కామినేని, గుర్రం వెంకటరమణ, అనిల్‌నాయుడు, కెఎస్.దివాకర్ తదితరలు పాల్గొన్నారు. సర్కిల్లో ఆందోళన చేపట్టి ప్రజలకు ఇబ్బంది కలిగించినందుకు రవికుమార్, అనిల్‌నాయుడు, సోమశేఖర్ రెడ్డి తదితరులు పోలీసులు అదుపులోకి తీసుకుని తర్వాత విడుదల చేశారు.

కంప్లిలో..

కంప్లి, (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నుంచి రబీ సాగుకు నీరు ఇచ్చేందుకు ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తుందని కంప్లి నియోజకవర్గ బీజేపీ పార్టీ అధ్యక్షుడు మహదేవ మండిపడ్డారు. శుక్రవారం కంప్లి పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిమ్మప్ప నాయక్, సుదర్శన్ రెడ్డి, దేవేంద్ర, చెన్నప్ప, అమరగౌడ, రామాంజినేయులు, నాగరాజు, గోపాల్, ఆంజనేయులు, లక్ష్మీకాంతరెడ్డి, రియాజ్, మనోజ్, హాలిగప్ప, రబియా తదితరులు పాల్గొన్నారు.



కంప్లిలో రోడ్డుపై బైఠాయించిన బీజేపీ కార్యకర్తలు

హోసూరు జోన్

కేంద్ర కార్మిక చట్టాలపై నిరసన



నిరసనలో ఎమ్మెల్యే ప్రకాశ్, మేయర్ సత్య తదితరులు

హోసూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం జారీ చేసిన కార్మిక కోడ్‌లను ఉపసంహరించుకోవాలని కోరుతూ నగరంలోని అన్నానగర్ విగ్రహం వద్ద తమిళనాడు డెమొక్రటిక్ ఫ్రంట్ టీడీఎఫ్ తరపున నిరసన తెలిపారు. శుక్రవారం ఏర్పాటైన నిరసనలో ఎల్‌బీఎఫ్ జిల్లా కౌన్సిల్ కార్యదర్శి గోపాల అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే వై.ప్రకాశ్, మేయర్ సత్య, డిప్యూటీ చైర్మెన్ కృష్ణన్, మాజీ ఎమ్మెల్యే కృష్ణమూర్తి తదితరులు పాల్గొని నిరసనకు మద్దతు తెలిపారు. కార్మికహక్కులను హరించే విధంగా సవరణలు చేశారని ఆరోపించారు. ఈనెల 21న జారీ చేసిన నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, రైతుల పండించే పంటలకు కనీస ధరలు నిర్ణయించాలన్నారు. అసంఘటిత కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను సద్వినియోగం చేయాలని, సామాజిక భద్రతను నిర్ధారించాలన్నారు. ఉపాధి హామీలో 100 రోజుల పని కార్యక్రమాన్ని విస్తరించాలని డిమాండ్ చేశారు. మహిళలను ప్రమాదకరమైన ఉద్యోగాలలో ఉంచే కర్మాగారాల చట్ట సవరణను రద్దు చేయాలన్నారు. నిరసనలో ఏరియా కార్యదర్శి రాము, కృష్ణన్, కృష్ణమూర్తి, మోహన్, చిన్నాస్వామి, శేఖర్, మునిరాజు తదితరులు పాల్గొని నినాదాలు చేశారు.

రూ.10 లక్షలతో తారురోడ్డు పనులకు శ్రీకారం

హోసూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): హోసూరు శాసనసభ నియోజకవర్గంలోని హోసూరు కార్పొరేషన్ 34వ వార్డులో ఎమ్మెల్యే అభివృద్ధి నిధి తారు రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. స్థానికుల డిమాండ్ మేరకు కౌన్సిలర్ నరేశ్ చొరవతో గణపతి నగర్‌లో సుమారు రూ.10 లక్షల విలువైన ప్రాజెక్టును పనులను చేపట్టారు. ఎమ్మెల్యే వై ప్రకాశ్, మేయర్ సత్య భూమిపూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర కళలు, సాహిత్య ఉప కార్యదర్శి మాదేశ్వరన్, ఏరియా కార్యదర్శి రాము, వార్డు డీఎంకే కార్యదర్శులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

డీఎంకే ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు



క్రీడాకారులతో ఎమ్మెల్యే వై ప్రకాశ్ తదితరులు

హోసూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ పుట్టినరోజు నేపథ్యంలో కృష్ణగిరి పశ్చిమ జిల్లా డీఎంకే ఆధ్వర్యంలో శుక్రవారం హోసూరులో రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభమైంది. క్రీడా పోటీలను కృష్ణగిరి జిల్లా డీఎంకే కార్యదర్శి, ఎమ్మెల్యే వై ప్రకాశ్ ప్రారంభించారు. తళి రోడ్డులోని స్పోర్ట్స్ హాల్‌లో కబడ్డీ టోర్నీకి రాష్ట్రం నలుమూలల నుంచి 38 జట్లు పాల్గొన్నారు. హోసూరు రామనాయకన్ పార్కు నుంచి తళి రోడ్డులోని క్రీడా మైదానం వరకు విద్యార్థులు ర్యాలీగా సాగారు. టోర్నీ మూడు రోజులపాటు ఆదివారం వరకు కొనసాగనుంది. ప్రథమ బహుమతిగా రూ.1.50 లక్షలు, రెండో బహుమతిగా రూ.1 లక్ష, మూడో, నాల్గో బహుమతిగా రూ.50వేలు ట్రోఫీ ఇవ్వనున్నారు. విజేత మహిళా జట్టుకు మొదటి 4 బహుమతులు ఒక్కొక్కరికి రూ.50 వేలు ఇవ్వనున్నారు. గెలిచిన జట్టు భారతదేశం అంతటా జరిగే కబడ్డీ టోర్నమెంట్‌లో ఆడేందుకు అర్హత సాధిస్తారు. క్రీడాకారుల జట్లను పరిచయం అనంతరం ఎమ్మెల్యే వై ప్రకాశ్ కూడా కబడ్డీ ఆడుతూ ఆటను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ తమిళనాడు ఉప ముఖ్యమంత్రి, యువజన కార్యదర్శి ఉదయనిధి స్టాలిన్ పుట్టినరోజు సందర్భంగా కృష్ణగిరి జిల్లా డీఎంకే తరపున రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పౌర ఆహార సరఫరాలశాఖ మంత్రి ఎ.చక్రపాణి పాల్గొని తొలి 4 విజేత జట్లకు బహుమతులు ప్రదానం చేస్తారన్నారు. హోసూరులో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం ఇదే మొదటిసారి అన్నారు. విజేత జట్టు జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా హోసూరు మున్సిపల్ మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, మాజీ ఎమ్మెల్యే మురుగన్, హోసూరు మున్సిపల్ హెల్త్ కమిటీ చైర్మెన్ మాదేశ్వరన్, పన్నుల స్థాయి సమితి చైర్మన్ చైర్మెన్ చెన్నీరప్ప, రాష్ట్ర యువజన విభాగం డిప్యూటీ ఆర్గనైజర్ శ్రీనివాసన్ బృందవన్, పాఠశాల ప్రిన్సిపాల్ శేఖర్, డీఎంకే నాయకులు యువరాజు, ఎల్లోరమణి, సుకుమారన్ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు నుంచి శబరిమలైకు ప్రత్యేక బస్సులు

హోసూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): హోసూరు నుంచి శబరిమలైకు ప్రత్యేక బస్సులను ప్రారంభించారు. కేరళ రాష్ట్రం శబరిమలై అయ్యప్ప ఆలయంలో జరిగే మండల పూజ, మకర జ్యోతి వేడుకల కోసం అయ్యప్ప భక్తులను తీసుకెళ్లేందుకు ప్రభుత్వం రాపిడ్ ట్రాన్సిట్ కార్పొరేషన్ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ప్రస్తుతం హోసూరు, ధర్మపురి, కృష్ణగిరి, సేలం, కరూర్ ప్రాంతాల నుంచి అయ్యప్ప భక్తులు సందర్శిస్తున్నారు. అత్యంత ఆధునికమైన నాన్-ఎయిర్ కండిషన్ సీట్లు బస్సు శుక్రవారం ప్రారంభించారు. హోసూరు బస్టాండ్‌లో బస్సులకు పూజలు చేశారు. 2026 జనవరి 16వరకు ప్రత్యేక బస్సులు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యా విప్లవానికి మార్గదర్శకుడు జ్యోతిబాపూలే

● వర్ధంతి కార్యక్రమంలో ఏఐడీఎస్ఓ జిల్లా అధ్యక్షుడు ఈరన్న



జ్యోతిబాపూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

బళ్లారి సిటీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అజ్ఞానం అనే చీకటినీ పారద్రోలడానికి మహిళలు, దళితులకు జ్ఞాన వెలుగును అందించడం ద్వారా పాఠశాలను ప్రారంభించిన వ్యక్తి జ్యోతిబాపూలే అని ఏఐడీఎస్ఓ జిల్లాధ్యక్షుడు కే.ఈరన్న అన్నారు. శుక్రవారం పూలే వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్య సార్వత్రికంగా, అందరికీ అందుబాటులో ఉండాలని బ్రిటీష్ వారిపై పోరాడిన గొప్పవ్యక్తి పూలే అన్నారు. విద్య ద్వారా మాత్రమే మానవులకు విమర్శనాత్మక దృక్పథం, ఆత్మగౌరవం లభించగలదని ఆయన భావించారన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కేపీఎస్ మాగ్నెట్ స్కూల్ పథకం కింద 40వేలకు పైగా పాఠశాలలను మూసివేయడం దారుణమన్నారు. విలీనం పేరుతో విద్యార్థులను చదువుకు దూరం చేయరాదన్నారు. విదేశీ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని 800 పాఠశాలలుగా గుర్తించారు. అంటే కర్ణాటక పబ్లిక్ స్కూల్స్ చుట్టూ 6నుంచి 7కి.మీ పరిధిలో మూసేస్తారన్నారు. బళ్లారిలోని విమ్స్ మైదానం, జిల్లాస్టేడియం,పాఠశాలలు, కళాశాలల్లో జ్యోతిబాపూలే వర్ధంతిని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎం.శాంతి, తిప్పేస్వామి, జిల్లాకార్యదర్శి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

4న సిద్దేశ్వర తాతయ్య పుణ్యస్మరణ



కంప్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సిరిగేరి సమీపంలోని సిద్దరాంపురం గ్రామానికి చెందిన శ్రీశైల కడలివన సిద్దేశ్వర తాతయ్య 21వ పుణ్యస్మరణ డిసెంబరు 4న నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 4వతేదీ ఉదయం సిద్దేశ్వర తాతగారి పీఠంపై ఉన్న శ్రీమఠిలో జలాభిషేకం, రుద్రాభిషేకం, పుష్పాభిషేకం వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా శ్రీమఠిలో ఉచిత సామూహిక వివాహాలు, శివదీక్ష కార్యక్రమం నిర్వహిస్తారు. ఎమ్మిగనూరుకు చెందిన వామదేవ మహంత్ రాజదేశి, కేంద్ర శివాచార్య ఉట్కనూరుకు చెందిన మరిబసవరాజు రాజదేశి కేంద్ర శివాచార్యులు, చిదానంద తాతను పూర్ణకుంభాలకు భక్తులు ఊరేగింపు నిర్వహించి తులాభార సేవ నిర్వహిస్తారు.

దుర్గమ్మ జాతరపై ముందస్తు సమావేశం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ హెచ్‌జీ రాములు

గంగావతి రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నగర ఆరాధ్యదేవత దుర్గమ్మదేవి జాతరపై శుక్రవారం ఆలయంలో ముందస్తు సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి శ్రీరాములు, మాజీ ఎంపీ హెచ్.జీ. రాములు, ఎమ్మెల్యే గాలి జనార్ధన్ రెడ్డి సమావేశానికి హాజరైయ్యారు. దుర్గమ్మ జాతర డిసెంబరు 18 నుంచి నిర్వహిస్తామని, జాతరను విజయవంతం చేయాలని మాజీ ఎంపీ హెచ్.జీ రాములు కోరారు. భక్తులకు పూర్తి సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మాజీ మంత్రి మల్లికార్జున, నాగప్ప, మాజీ ఎమ్మెల్సీ హెచ్ఆర్ శ్రీనాథ్, మాజీ ఎమ్మెల్యే పరాన్నమనవళి, ఆలయ కమిటీ అధ్యక్షుడు జోగదు నారాయణప్పనాయక్, వీరభద్రప్పనాయక్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు సింగనాళ విరుపాక్షప్ప తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నీలమ్మ, పేట బసవేశ్వరుడి కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

కంప్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ప్రసిద్ధి గాంచిన నీలమ్మదేవి, పేటే బసవేశ్వర వివాహ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ వివాహ మహోత్సవంలో గణమటయ్య శాస్త్రి, బసవరాజు శాస్త్రి పురోహితులుగా వాయిస్తూ ఈ నీలమ్మపేట బసవేశ్వర వివాహ మహోత్సవాలను జరిపారు. ఇప్పటికే జోడు కలశధారణ, కంకణధారణ, శనివారం పూలతో అడ్డపల్లకి ఊరేగింపు ఆదివారం నీలమ్మదేవి పేట బసవేశ్వర జోడు రథోత్సవాలు వైభవంగా జరుగుతాయని తెలిపారు.

ఈ-పట్టా సేవలను సద్వినియోగం చేసుకోండి

● ఏడీసీ మహమ్మద్ జుబేర్

సిరుగుప్ప, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): భూములకు సంబంధించి ఈ పట్టా సేవలను సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ మహమ్మద్ జుబేర్ తెలిపారు. సిరుగుప్ప తాలుకాలోని సిరిగేరి గ్రామం రెవెన్యూ కార్యాలయంలో ఈ సేవలు పొందడంపై ఆందోళన కార్యక్రమం జరిగింది. అడిషనల్ కలెక్టర్ మహమ్మద్ జుబేర్ మాట్లాడుతూ తాలుకాలో 700 మంది మృతి చెందిన వారు ఉన్నారన్నారు. ఆ పేర్లను ఇతరులకు మార్పిడి చేయాలంటే తప్పనిసరిగా సరైన రికార్డులు అందజేసి పట్టాలను పొందాలన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గౌసియా బేగమ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, పంచాయతీ అధ్యక్షురాలు రశ్మి, రైతులు పాల్గొన్నారు.

నిరవధిక ధర్నాకు కల్చరల్ ఆర్ట్స్ క్లబ్ మద్దతు

గంగావతి రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కొప్పల్ జిల్లాలో జరుగుతున్న రైతుల నిరవధిక ధర్నా 29వ రోజుకు చేరుకుంది. ధర్నాకు కల్చరల్ ఆర్ట్స్ క్లబ్ సభ్యులు శుక్రవారం మద్దతు పలికారు. ధర్నాలో పాల్గొని నిరసన తెలిపారు. బసాపురా గ్రామ సరస్సు 44.35 ఎకరాలను ప్రజలకు తిరిగి ఇవ్వలిని అలాగే బాల్డోటా (ఎంఎస్పీఎల్), కిర్లోస్కర్, కల్యాణి స్టీల్, ముకుంద సుమి, ఎక్సిండియా వంటి భారీ ఉక్కు కర్మాగారాల విస్తరణను వెంటనే నిలిపివేయాలని మున్సిపల్ అధ్యక్షుడు అమ్జాద్ పటేల్ డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీని విస్తరిస్తే కొప్పల్ మనుగడ సాగించదని మండిపడ్డారు. కార్యక్రమంలో గొండాబా జి. మంజునాథ మల్లికార్జున, దురగప్ప, కనకమ జిచ్చ, మంజునాథ్ కవలూర్, సంజీవమూర్తి, జెవినగిడ, సుంకప్పమీసి, హదేవప్ప, ఎస్. మావినమడు, సూభాన్ సీరల్లి, రవి కాంతనవర్, ఎస్.బి. రాజుర, రిటైర్డ్ సూపరిడెంట్ ఎఫ్ఎస్ జలిహాల, మంగేళేష్, రాథోడ్, హనుమంత కాటగి, గవిసిద్ధప్ప, హలిగి, ముదకప్ప, హోసమని తదిరతుల పాల్గొన్నారు.

బళ్లారి పోస్ట్ డివిజన్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న బళ్లారి పోస్టల్ డివిజన్ అధికారి చిదానంద

బళ్లారి సిటీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పోస్టల్ శాఖ బళ్లారి విడిజన్ 2024-25 సంవత్సరానికిగాను వివిధ విభాగాల్లో 33 అవార్డులను అందుకంది. దీంతో అత్యధిక అవార్డులను అందుకున్న జిల్లాగా బళ్లారి ఘనతను సంపాదించింది. ఈనెల 21న గోకర్ణలో జరిగిన కర్ణాటక సర్కిల్, జోన్‌స్థాయి అవార్డుల ప్రధానోత్సవంలో ఉత్తర కర్ణాటక జోన్‌లోని పోస్టల్ విభాగాలు, సిబ్బందికి అవార్డులను ప్రదానం చేశారు. బళ్లారి పోస్టల్ విడిజన్ లైఫ్ ఇన్సూరెన్స్ స్కీమ్ విభాగంలో మొత్తం 14అవార్డులను ,పొదుపు పథకాల విభాగంలో మొత్తం 13 అవార్డులను, బీడీ (బిజినెస్ డెవలప్‌మెంట్) ఇతర విభాగాలలో మొత్తం ఐదు అవార్డులను గెలుచుకుంది. బళ్లారి పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ పి.చిదానంద, కూడ్లిగి సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ శశి కుమార్ హిరేమఠ్, బళ్లారి పోస్ట్ మాస్టర్ భీమసేన, హొసపేట పోస్ట్‌మాస్టర్ రామారావు, కూడ్లిగి పోస్ట్‌మాస్టర్ వెంకటేశ్, భీమా డెవలప్‌మెంట్ అధికారి మారుతి ఉప్పరహట్టి, హానాసి పోస్ట్‌మాస్టర్ మొహిదీన్, నిడగుర్తి బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ దాదాపీర్, ఈరమ్మ, జలజాక్షి, భీమా పథకం డైరెక్టర్ మల్లేశ్ అవార్డులు అందుకున్నారు. ఉత్తర కర్ణాటక జోన్ పోస్ట్‌మాస్టర్ జనరల్ చంద్రశేఖర్ కాకుమాను, పోస్టల్ డైరెక్టర్ తారా పంపిణీ చేశారు.

మంత్రి భోసరాజుపై గవర్నర్‌కు ఫిర్యాదు

రాయచూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగిని దుర్భాషలాడారన్న ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర చిన్ననీటి పారుదల, సైన్స్ అండ్ టెక్నాలజి శాఖల మంత్రి ఎన్.ఎస్.భోసరాజు పై జిల్లాకు చెందిన సామాజిక కార్యకర్త దినేశ్ కల్లహళ్ళి గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. ఇటీవల మంత్రి జిల్లా పర్యటన సందర్భంగా సిరవార తాలూకాలోని కేఆర్ఐడీఎల్ పరిధిలో నిర్మించాల్సిన రోడ్డు పనులు ప్రారంభం కాకపోవడాన్ని తీవ్రంగా పరిగణించిన మంత్రి సంబంధిత ఇంజనీయర్ హనుమంత్రాయను దుర్భాషలాడడమే గాక ప్రజల ఎదురుగా స్తంభానికి కట్టేసి కొడుతానంటు చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. బాధ్యతయుతమైన మంత్రి పదవిలో ఉండి అధికారుల పట్ల ఇలా దురుసుగా వ్యవహరించిన మంత్రిపై చర్యలు తీసుకోవాలని తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు సామాజిక కార్యకర్త దినేశ్ కల్లహళ్ళి శుక్రవారం ఒక ప్రకటనల ద్వార పాత్రికేయులకు తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగి అయిన ఇంజనీయర్‌ను ప్రజల ఎదుట దుర్భాషలాడడం అన్ పార్లమెంటరీ భాషను వినియోగించడాన్ని తీవ్రంగా పరిగణించి చట్టపరంగా చర్యలు తీసుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని ఫిర్యాదులో కోరారు.

115 కిలోల జొన్న బస్తాతో అంజనాద్రిపైకి..

● హనుమంతుడికి మొక్కు చెల్లించుకున్న భక్తుడు

బళ్లారి గాంధీనగర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గంగావతి తాలూకా చిక్కరాంపుర సమీపంలోని అంజనాద్రి బెట్టను బాగలకోట జిల్లా, హునగుంద తాలూకా బిసలదిన్ని గ్రామానికి చెందిన శంకర్ బసప్ప కురి అనే యువకుడు 115 కిలోల బరువున్న జొన్నసంచిని భుజంపై పెట్టుకుని మెట్లెక్కి మొక్కులు తీర్చుకున్నాడు. 575 మెట్లపై ఎక్కడా ఆగకుండా శ్రీరామ నామస్మరణతో మెట్లు ఎక్కి అందరినీ ఆశ్చర్యపరిచాడు. అనంతరం 115కిలోల సంచిని స్వామి వారికి అర్పించి స్నేహితులతో కలిసి ఆంజనేయస్వామిని దర్శించుకున్నాడు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ, ఇంటి సమస్యల పరిష్కారించాలని హనుమంతుడిని మొక్కుకున్నాని, అందుకే జొన్నగింజల సంచితో అంజనాద్రి ఎక్కానన్నారు.



జొన్నల బస్తాతో అంజనాద్రికి చేరుకున్న భక్తుడు శంకర్